మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి

# ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 28-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 240 Issue: 240

Published from Jagitial www.evarthalu.com


28 ఫిబ్రవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:38 సూర్యాస్తమయం - సా. 6:18 తిథి ద్వాదశి రా. 8:46 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పునర్వసు ఉ. 9:33 వరకు తరువాత పుష్యమి యోగం సౌభాగ్య సా. 5:03 వరకు కరణం బవ ఉ. 9:37 వరకు భాలవ రా. 8:46 వరకు వర్జ్యం సా. 5:15 నుండి సా. 6:47 వరకు దుర్ముహూర్తం ఉ. 8:12 నుండి ఉ. 8:58 వరకు రాహుకాలం ఉ. 9:33 నుండి ఉ. 11:01 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం ఉ. 6:38 నుండి ఉ. 8:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:02 నుండి తె. 5:50 వరకు అమృత ఘడియలు ఉ. 7:17 నుండి ఉ. 8:48 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:52 వరకు




# "లిక్కర్ స్కాం" తుపేల్!

ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాలను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అలాగే ఈ కేసులో దర్యాప్తు సంస్థలు అభియోగాలు మోపిన 23 మందికి విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు కూడా భారీ ఊరట లభించింది.

## ఢిల్లీ మద్యం పాలసీలో కుట్ర లేదు

### దర్యాప్తులో అనేక లోపాలున్నయ్.. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు

### కేజ్రీవాల్, సిసోడియా, కవితకు క్లీన్ చిట్.. మరో 23 మందికి కేసులోంచి విముక్తి

న్యూఢిల్లీ: కేసు విచారణ సందర్భంగా.. ఎక్సైజ్ పాలసీలో ఎటువంటి కుట్ర లేదా నేరపూరిత ఉద్దేశ్యం లేదని అని కోర్టు పేర్కొంది. దర్యాప్తులో లోపాలపై కోర్టు... సీబీఐని తీవ్రంగా విమర్శించింది. 'భారీ ఛార్జిషీట్'లో ఏ సాక్షి లేదా స్టేట్‌మెంట్ ద్వారా మద్దతు ఇవ్వని అనేక లోపాలు ఉన్నాయని తెలిపింది. వేల పేజీల సీబీఐ ఛార్జిషీట్‌లో సాక్షుల స్టేట్‌మెంట్‌లకు మద్దతు ఇవ్వని అంశాలు ఉన్నాయని అసహనం వ్యక్తం చేసింది. ఛార్జిషీట్‌లో తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు ఉన్నాయని కూడా న్యాయమూర్తి అన్నారు.

**ఢిల్లి లిక్కర్ కేసు ఇదీ..**

ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వ హయాంలో రూపొందించి ఎక్సైజ్ పాలసీపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. గతంలో ఉన్న ఎక్సైజ్ పాలసీతో పోలిస్తే కొత్త తరువాయి 2 వ పేజీలో...

# అన్నా చెల్లి.. డిష్యుం డిష్యుం

### లిక్కర్ కేసుతో బీఆర్ఎస్‌కు నష్టం: కేటీఆర్



ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన తరువాత తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. జాగృతి అధ్యక్షురాలు కవిత, తన కేటీఆర్ వ్యాఖ్యలకు ఆమె ఇచ్చిన కౌంటర్ రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. అసలేం జరిగిందంటే.. కోర్టు తీర్పు అనంతరం కేటీఆర్ ట్వీట్ చేస్తూ.. ఢిల్లీ లిక్కర్ కేసులో చివరికి న్యాయమే గెలిచిందన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసు సాకుతో కేజ్రీవాల్ సర్కారు కూల్చారని, ఆ కేసు వల్ల బీఆర్ఎస్ నష్టపోయిందన్నారు. ఈ కేసులో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు తేటతెల్లమ య్యాయమన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): రాజకీయ కుట్రలో భాగమే ఈ కేసు అని తేలిపోయిందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలను వ్యక్తిగతంగా తీసుకున్న కవిత వాటిపై తీవ్రంగా స్పందించారు. 'నా మీద పెట్టిన కేసు వల్లే పార్టీ ఓడిపోయిందని చెప్పడం ద్వారా నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు' అని ఆమె స్పష్టం చేశారు. రాజకీయంగా ఇది కేవలం అభిప్రాయ భేదం కాకుండా కుటుంబం లోపలే విభేదాలు బయటపడినట్టు కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ పరాజయం ఒక వ్యక్తి కారణంగా జరగలేదు. పార్టీ నాయకత్వంలో పెరిగిన అహంకారం ప్రజలను దూరం చేసింది. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల హామీ పూర్తిగా అమలు కాలేదు. నిరుద్యోగులకు సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయాం. క్షేత్రస్థాయిలో వ్యతిరేకత ఉన్నప్పటికీ తరువాయి 2 వ పేజీలో...



## చిలుకూరు ప్రధాన అర్చకుడు సౌందర్ రాజన్ కన్నుమూత

చిలుకూరు-రంగారెడ్డి, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధానార్చకుల సౌందర్ రాజన్ (90) కన్నుమూశారు. గత కొంతకాలం నుంచి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం తుదిశ్వాస విడిచారు. చిలుకూరులోని ఆయన నివాసంలోనే సౌందర్ రాజన్ కన్నుమూశారు. దేవాలయాల -2 వ పేజీలో...



## 5 లక్షల కోట్లు ఆవిరి

### భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,000 పాయింట్లకు పైగా పతనమైంది. చివరకు 961 పాయింట్ల నష్టంతో 81,287 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 318 పాయింట్లు తగ్గి 25,179 వద్ద ముగిసింది.



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,157 |
| వెండి (గ్రాము): | రూ.295 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,965 |

# అఫ్ఘన్-పాక్ వార్!

## యుద్ధం ప్రకటించిన పాకిస్థాన్

### పలు ప్రాంతాలపై బాంబుల వర్షం.. దీటుగా తాలిబన్ల ప్రతిఘటన



పశ్చిమాసియాలో మరో యుద్ధ జ్వాల మొదలైంది. పొరుగు దేశాలైన పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. గత కొంతకాలంగా సరిహద్దు గొడవలతో సతమతమవుతున్న ఈ రెండు దేశాలు.. ఇప్పుడు నేరుగా ఒకరిపై ఒకరు యుద్ధం ప్రకటించుకున్నాయి.

కాబూల్: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'మా ఓపిక నశించింది. ఇది ఇకపై మీకూ మాకూ మధ్య బహిరంగ యుద్ధమే' అని ప్రకటించడం అంతర్జాతీయ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. గురువారం రాత్రి అఫ్ఘాన్ తాలిబన్ దళాలు పాక్ సరిహద్దు పోస్టులపై జరిపిన మెరుపు దాడులకు ప్రతీకారంగా పాకిస్థాన్ తన గగనతల శక్తిని ప్రయోగించింది. 'ఆపరేషన్ గజబ్-లిల్-హక్' పేరుతో అఫ్ఘాన్ రాజధాని కాబూల్, కాందహార్, తరువాయి 2 వ పేజీలో...



# ఇక కోర్ అర్బన్ చట్టం!

### జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి

### అధికారులకు సీఎం ఆదేశాలు

### ఫ్యూచర్ సిటీ పనుల్లో వేగం పెరగాలి


### ఎంపయూడీ పరిధిలోకి ఓఆర్ఆర్ లోపలి రోడ్లు

### సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

ఔటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు కార్పొరేషన్లకు వర్తించేలా గ్రేటర్ హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): అనుమతులు, రుసుమలు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికి ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్లకు చెందిన అమ్ముడుపోని వస్త్రాలు, బూట్లను నాశనం చేసే విధానానికి యూరోపియన్ యూనియన్ స్వస్తి చెప్పనుంది. పర్యావరణానికి హాని చేసే ఈ ప్రక్రియను వచ్చే జూలై నుంచి నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఏటా 4-9 శాతం వస్త్రాల్లో వేస్టేజీ ఉంటోంది. దీన్ని తగ్గించేందుకే కొత్త పద్ధతులను చేపట్టాలని నిర్ణయించింది.



# జీఐ ఆన్ వీల్స్

## కళారూపాలపై ప్రజలకు అవగాహన

### శ్రీకారం చుట్టిన టీజీఎస్ఆర్టీసీ.. ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అఫ్జల్‌గంజ్-హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): దేశంలోనే తొలిసారిగా "జీఐ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగి రెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన తరువాయి 2 వ పేజీలో...


# 745 కోట్ల పెండింగ్ బిల్లులు రిలీజ్

## ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రూ.745 కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో సంబంధిత అధికారులు నిధులను విడుదల చేశారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఉద్యోగులకు విడతల వారీగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేస్తామని గతంలోనే రేవంత్ సర్కార్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా తాజాగా బకాయి నిధులను విడుదల చేశారు. మరోవైపు.. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కూడా రేవంత్ సర్కార్ మరో రూ.389 కోట్ల నిధులను విడుదల చేసింది. గతంలో ఉద్యోగ సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల సందర్భంగా.. ప్రతీ నెలా కనీసం రూ.700 తరువాయి 2 వ పేజీలో...




## 'కేరళ స్టోరీ 2'కి ఊరట

### విడుదలకు కేరళ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

తిరువనంతపురం: కేరళ స్టోరీ 2 సినిమా నిర్మాతలకు కేరళ హైకోర్టు ఊరట కల్పించింది. సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'ది కేరళ స్టోరీ 2' సినిమాలో కంటెంట్ మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆరోపిస్తూ కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సెన్సార్ బోర్డు ఈ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

28.2.2026

మేషం: ఉద్యోగ విషయమై శుభవార్తలు అందుతాయి. గృహమున సంతోషకర వాతావరణం ఉంటుంది. పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. కొన్ని పనులు అనుకూలంగా మారుతాయి. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఉద్యోగ అవకాశాలు పొందుతారు.

వృషభం: కుటుంబ విషయాలలో చిక్కులు కలుగుతాయి. ధనపరంగా ఇబ్బందులుంటాయి. ఖర్చులు అదుపు చేయడం మంచిది. పనులు నిదానంగా పూర్తవుతాయి. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన విసుగు తెప్పిస్తుంది.

మిధునం: అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. బంధు మిత్రులతో సఖ్యత కలుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి, సమాజంలో ఆదరణ పెరుగుతుంది. వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు.

కర్కాటకం: కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. నూతన ఋణాలు చేయవలసి రావచ్చు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో అకారణంగా వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగులకు అధికారుల నుండి అనుకూలత ఉండదు. ప్రయాణాలలో ప్రమాద సూచనలు.

సింహం: చేపట్టిన పనులలో ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సమాజంలో పెద్దలతో పరిచయాలు లాభిస్తాయి. ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సమాజానికి ఉపయోగపడే పనులు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఉద్యోగంలో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు.

కన్య: తండ్రి తరుపు బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. భూ సంబంధిత వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగ విషయమై కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు రెండు రకాలుగా మారుతాయి. కుటుంబ సభ్యుల ఒత్తిడి అధికమవుతుంది. స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. అనారోగ్య సూచనలున్నవి. వ్యాపార ఉద్యోగాలలో అదనపు పని భారం వలన శ్రమ కలుగుతుంది.

వృశ్చికం: వ్యాపార పరంగా స్థిరమైన నిర్ణయాలు చేయలేరు. చేపట్టిన పనులలో ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. నూతన ఋణాలు చేయవలసి రావచ్చు. కావలసిన వారితో విభేదాలు కలుగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

ధనస్సు: చేపట్టిన పనులను విజయవంతంగా పూర్తిచేస్తారు. విందు వినోద కార్యక్రమాలకు కుటుంబ సభ్యులతో హాజరు అవుతారు. ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఆలోచనలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో ఉన్నతి కలుగుతుంది.

మకరం: దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రాధాన్యత పెరుగుతుంది. నూతన వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు కలసి వస్తాయి. శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. వాహన క్రయ విక్రయాలు లాభిస్తాయి.

కుంభం: ఋణ భారం పెరిగి నూతన ఋణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. బంధుమిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాల్లో వాహన ఇబ్బందులు ఉంటాయి. నూతన పెట్టుబడులు కలిసిరావు. ఉద్యోగాలలో విమర్శలు పెరుగుతాయి.

మీనం: ఆర్థిక విషయాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. ఋణ ప్రయత్నాలు కలిసిరావు. దూరపు బంధువుల నుండి ఒక వార్త విచారం కలిగిస్తుంది. దూర ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగులకు సామాన్యంగా ఉంటుంది. ఆరోగ్య విషయాలలో శ్రద్ధ తీసుకోవడం మంచిది.

# లిక్కర్ స్కాం తుపేల్!

**మొదటి పేజీ తరువాయి**

విధానం ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతుందని అప్పటి కేజ్రీవాల్ ప్రభుత్వం పేర్కొంది. ఆ తర్వాత ఈ పాలసీని ఢిల్లీ ప్రభుత్వం రద్దు చేసింది. అయితే, ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించి అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి సీబీఐ, ఈడీలు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాయి. ఈ క్రమంలోనే అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ కవిత కూడా ఈ కేసులో జైలుకు వెళ్లారు. ఈ కేసులో కేజ్రీవాల్‌తో సహా పలువురు నేతలు అరెస్ట్ కావడం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది.

### బీజేపీ 10 సీట్లు గెలిస్తే రాజకీయ సన్యాసం: కేజ్రీవాల్

బీజేపీ, ఆప్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో ప్రధాని మోడీ, బీజేపీకి ఆప్ అధినేత కేజ్రీవాల్ సవాల్ విసిరారు. శుక్రవారం (ఫిబ్రవరి 27) కోర్టు తీర్పు తర్వాత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు పెట్టండి.. బీజేపీ 10 సీట్లు గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఛాలెంజ్ చేశారు. ఈ కేసు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని అధికారం నుంచి తొలగించడానికి బీజేపీ పన్నిన కుట్ర అని.. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద రాజకీయ కుట్ర అని కేజ్రీవాల్ అభివర్ణించారు. ఆప్ వంటి ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలని ప్రయత్నించడం కంటే ప్రధాని మోదీ, అమిత్ షా దేశ ప్రయోజనాల కోసం పనిచేయడంపై దృష్టి పెట్టాలని చురకలంటించారు. అధికారం కోసం ఎవరూ దేశంతో రాజ్యాంగంతో ఆటలాడకూడదని హెచ్చరించారు. లిక్కర్ పాలసీ కేసు మొత్తం కల్పితమని కోర్టు తీర్పు ద్వారా స్పష్టమైంది.. మేం కూడా మొదటి నుంచే ఇదే విషయం చెబుతున్నామని పేర్కొన్నారు. కోర్టు తీర్పును స్వాగతించిన కేజ్రీవాల్.. చివరకు న్యాయం జరిగిందని, అబద్ధంపై నిజం గెలిచిందని అన్నారు. ఈ కేసులో బలంగా వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో సహా తన న్యాయ బృందానికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అక్రమ కేసులు బనాయించి తమను ఇబ్బంది పెట్టిన ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.




### సత్యమేవజయతే: కవిత

కోర్టు తీర్పు తర్వాత ఎక్స్ వేదికగా స్పందించిన కల్వకుంట్ల కవిత.. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేశారు. కోర్టులపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని రుజువైందని కవిత తెలిపారు. తాను కడిగిన ముత్యంలా ఈ కేసులో నుంచి బయటికి వస్తానని మొదటి నుంచి తెలంగాణ ప్రజలకు చెబుతున్నానని.. ఇప్పుడు అలాగే వచ్చానని వెల్లడించారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని తాను ఎన్నోసార్లు చెప్పానని.. అదే ఇప్పుడు నిజమైందని పేర్కొన్నారు. ఈ కేసులో తనను నిందితురాలిగా చేర్చడం, అరెస్ట్ చేసి జైలుకు పంపించడం వల్ల తనతోపాటు.. తన కుటుంబం కొన్ని నెలలపాటు తీవ్రమైన క్షోభను అనుభవించామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నారని కవిత పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు తీర్పు వెలువరించకుండానే తనపై కొందరు అనుచితంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట కాలంలో తనకు అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా కేసు నుంచి ఉపశమనం లభించడంతో మరింత ఉత్సాహంతో తెలంగాణ ప్రజలకు సేవ చేస్తానని కవిత వెల్లడించారు. తనను అన్యాయంగా ఐదున్నర నెలల పాటు జైలుకు పంపించి.. తన కుటుంబానికి దూరం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనైన కవిత.. ఈ మద్యం కేసు రాజకీయ కోణంలో పెట్టిందని అప్పుడే కేసీఆర్ కూడా చెప్పినట్లు గుర్తు చేశారు. ఇన్నాళ్లు తనకు రకరకాల పేర్లు పెట్టి.. దుష్ప్రచారం చేసిన వాళ్లంతా ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

### హైకోర్టులో సీబీఐ అప్పీల్

లిక్కర్ కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సీబీఐ హైకోర్టులో సవాల్ చేసింది. లిక్కర్ కేసులో కేజ్రీవాల్, కవిత సహా 23 మంది నిందితులను ట్రయల్ కోర్టు డిశ్చార్జ్ చేసిన సంగతి తెలిసిందే. అభియోగాలకు తగిన ఆధారాలను సీబీఐ చూపకపోవడంతో నిందితులను స్పెషల్ కోర్టు జడ్జి జితేందర్ సింగ్ డిశ్చార్జ్ చేశారు. ఈ నేపథ్యంలో దిగువ కోర్టు ఉత్తర్వులను నిలిపివేయాలని హైకోర్టును సీబీఐ కోరింది.



# జీఐ ఆన్ వీల్స్

**మొదటి పేజీ తరువాయి**

దాసరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ, జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన 6 ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు.

# 'కేరళ స్టోరీ 2'కి ఊరట

**మొదటి పేజీ తరువాయి**

చిత్రానికి 'యూ/ఏ' సర్టిపికేట్ ఇచ్చారని, దాన్ని రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. సినిమా విడుదలను రెండు వారాల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తూ స్టే విధించింది.

'ది కేరళ స్టోరీ 2' విడుదలపై కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే ఇవ్వడంపై చిత్ర నిర్మాతలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇరు వర్గాలు వాదనలు విన్న న్యాయస్థానం.. సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. జస్టిస్ ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ పి.వి. బాలకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సినిమా విడుదలకు మార్గం సుగమం అయింది. థియేటర్లలో రిలీజ్ చేసుకోడానికి అడ్డంకి తొలగినట్లైయింది. 'ది కేరళ స్టోరీ 2' సినిమాకి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఇందులో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించారు. నిజజీవిత కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కించినట్లు మేకర్స్ చెబుతున్నారు. అయితే ప్రేమ పేరుతో హిందూ యువతులను ట్రాప్ చేసే అంశాలను ఈ చిత్ర ట్రైలర్‌లో చూపించడంతో.. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజకీయంగా, సామాజికంగా పెద్ద చర్చకు దారితీసింది. కేరళ సీఎం పినరయి విజయన్ 'ది కేరళ స్టోరీ 2'పై స్పందిస్తూ.. ప్రజలు ఈ సినిమా పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాయ్ కాట్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ తో సహా పలువురు సినీ ప్రముఖులు ఈ సినిమాపై విమర్శలు చేశారు. ఇదొక ప్రాపగండా సినిమా అని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ సినిమా విడుదలకు కేరళ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# అన్నా చెల్లి.. డిష్యుం డిష్యుం

**మొదటి పేజీ తరువాయి**

పాత అభ్యర్థులకే మళ్లీ టికెట్లు ఇవ్వడం ప్రజల్లో అసంతృప్తిని పెంచింది' అని పేర్కొన్నారు. 'న్యాయస్థానం తీర్పును తమకు అనుకూలంగా వాడుకుని మాట్లాడటం మానుకోవాలి. ప్రజల తీర్పును గౌరవించాలి' అని హితవు పలికారు. పార్టీ ఓటమిని తన మీద మోపడం సరైంది కాదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ కుట్రగా తేలిన తర్వాత కూడా పార్టీ నేతలు అదే విషయాన్ని ప్రస్తావించడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

# 745 కోట్ల పెండింగ్ బిల్లులు రిలీజ్

**మొదటి పేజీ తరువాయి**

కోట్లకు పైగా పెండింగ్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే గతేడాది జూన్ నెల నుంచి ప్రతీ నెల నిధులను సర్దుబాటు చేస్తోంది. అయితే ఉద్యోగులకు ప్రాధాన్య క్రమంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోంది. తాజాగా రేవంత్ సర్కార్ విడుదల చేసిన రూ. 745 కోట్ల బకాయిల్లో ఉద్యోగుల మెడికల్ రీయంబర్స్‌మెంట్, జీపీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్స్ వంటి వ్యక్తిగత క్లెయిమ్‌లకు అధిక ప్రాధాన్యాన్ని కల్పించారు. రిటైర్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్‌తోపాటు.. విధుల్లో ఉన్న వారికి అందాల్సిన పాత బకాయిలను కూడా చెల్లించడం ద్వారా వారికి ఉన్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. గతంలో ఎప్పుడో ఒకసారి ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుండగా.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఒక క్రమపద్ధతిని పాటిస్తూ.. క్రమం తప్పకుండా అందిస్తోంది. ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ.. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులను అందిస్తోంది. ఒకవైపు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసుకుంటూనే.. మరోవైపు.. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నెల నెలా క్రమం తప్పకుండా పెండింగ్ బిల్లులను విడుదల చేస్తుండటంతో తమపై ఉన్న ఆర్థిక భారం తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ముందు కూడా ఇదే స్ఫూర్తితో మిగిలిన బకాయిలను చెల్లించాలని కోరుతున్నారు.

# ఇక కోర్ అర్బన్ చట్టం!

**మొదటి పేజీ తరువాయి**

పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. ఎంఏయూడీపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుద్ధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడి వేయాలో తెలియక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని.. ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆ తర్వాత నిర్దేశిత ప్రాంతాల్లో కాకుండా ఇష్టారీతిగా ఎక్కడిపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఉపాధిహామీలో రోడ్ల నిర్మాణం నిర్దేశిత కాలం వరకు మళ్లీ వేయడానికి అనుమతులు రావని.. అలాంటి సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి.. ఆ లోపు దానిని తొలగించినా... అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే దానిని వెంటనే తెలుసుకొని పరిష్కరించాలన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నగరంలోని అన్ని హోటళ్లలోని కిచెన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తరచూ తనిఖీలు చేపట్టడంతో పాటు పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ఫుడ్ సేఫ్టీకి ఆయా హోటళ్లు తీసుకుంటున్న చర్యలను మదింపు చేసి వారికి రేటింగ్స్ ఇవ్వాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 50 అంతస్తులకుపైగా భవంతులు నిర్మాణాలు జరుగుతున్నాయని.. అంత ఎత్తులో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన అధునాతన సామగ్రి, సాంకేతికతను సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. నగరంలోని సర్కిల్స్ లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సీఎం సూచించారు. అదే సమయంలో యూనిపోల్స్‌ను ఏర్పాటు చేసి వాటిని మల్టీ యుటిలిటీ పోల్స్‌గా ఉపయోగించాలని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఆర్ అండ్ బీ, ఇతర విభాగాల పరిధిలోని రోడ్లన్నింటిని ఎంఏయూడీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. వివిధ యాజమాన్యాల పరిధిలో రోడ్లు ఉండడంతో ఉన్న గందరగోళాన్ని తొలగించాలని పేర్కొన్నారు. పనుల్లో ఏకరూపత, పనుల వేగవంతానికి ఇది తోడ్పడుతుందని సీఎం అన్నారు.

# 5 లక్షల కోట్లు ఆవిరి

**భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,000 పాయింట్లకు పైగా పతనమైంది. చివరకు 961 పాయింట్ల నష్టంతో 81,287 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 318 పాయింట్లు తగ్గి 25,179 వద్ద ముగిసింది. ఇది గత నెల రోజుల్లో అతి తక్కువ స్థాయి. ఈ భారీ నష్టాల వల్ల ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే రూ. 5 లక్షల కోట్లకుపైగా తగ్గింది. దీూజులో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 463 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్ రెండు రోజులుగా నష్టాల్లోనే ఉంది. రియాల్టీ, ఫైనాన్షియల్, ఆటో షేర్లు బాగా తగ్గాయి. సెన్సెక్స్‌లో భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో షేర్లు ఎక్కువగా నష్టపోయాయి.

# ...సౌందర్ రాజన్ కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి**

స్వయం ప్రతిపత్తి కోసం, హుండీలేని ఆధ్యాత్మిక పాలన కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారు. ఆలయంలో హుండీ లేకుండా, విఐపీ దర్శనాలు లేకుండా, అందరికీ సమానంగా స్వామి దర్శనం కల్పించే సంప్రదాయాన్ని కొనసాగించారు. 'కళ్లు తెరిచి స్వామివారిని చూడండి, కళ్లు మూసుకుని కాదు' అనే ఆయన మాటలు భక్తులలో విశేషంగా గుర్తింపు పొందాయి. ఆయన కుమారుడు సీఎస్ రంగరాజన్‌తో కలిసి ఆలయ సంప్రదాయాలను కాపాడటానికి, ఆలయ స్వతంత్రతను నిలబెట్టడానికి గొప్పగా కృషి చేశారు.

# అఫ్ఘన్-పాక్ వార్!

**మొదటి పేజీ తరువాయి**

పక్తియా ప్రాంతాల్లోని కీలక సైనిక స్థావరాలపై పాక్ యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో తాలిబన్లకు చెందిన రెండు బ్రిగేడ్ హెడ్ క్వార్టర్లతో పాటు భారీ ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు పాక్ ప్రకటించింది. మరోవైపు తాలిబన్ ప్రభుత్వం కూడా పాకిస్థాన్‌కు గట్టిగానే బదులిస్తోంది. తమ భూభాగంలోకి చొరబడిన పాక్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు అఫ్గాన్ సైన్యం ప్రకటించింది. దీనికి సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేసింది. అలాగే పాక్‌కు చెందిన 19 సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నామని, 55 మంది పాక్ సైనికులను హతమార్చామని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ వెల్లడించారు. ఈ ఘర్షణల్లో ప్రాణనష్టానికి సంబంధించి ఇరు దేశాలు భిన్నమైన వాదనలు చేస్తున్నాయి. 55 మంది పాక్ సైనికులు మరణించారని, తమ వైపు కేవలం 8 మంది సైనికులు మాత్రమే చనిపోయారని అఫ్గాన్ చెబుతోంది. తాము కేవలం ఇద్దరు సైనికులనే కోల్పోయామని, 133 మందికి పైగా అఫ్గాన్ ఫైటర్లను మట్టుబెట్టామని పాక్ ప్రధాన మంత్రి ప్రతినిధి ప్రకటించారు.

### పాక్‌పై ఢిల్లీ కుట్రలు: ఖవాజా

ఖవాజా.. భారత్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ, కాబూల్ కలిసి పాకిస్తాన్‌పై ప్రాక్సీ యుద్ధం చేస్తున్నాయని ఫ్రాన్స్ 24 ఇంటర్వ్యూలో అన్నారు. భారతే.. తమపై అఫ్ఘన్లు దాడులు చేసేలా ప్రేరేపించిందన్నారు. కానీ, భారత్ దానిని అంగీకరించదని, భారత్.. కాబూల్‌తో చాలా మంచి సంబంధాన్ని కలిగి ఉన్నారని అన్నారు.

# రేవంత్‌తో మాజీ మావోయిస్టుల భేటీ

## సచివాలయంలో కలిసిన ఆరుగురు మాజీ నక్సల్స్.. దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇప్పుడు ప్రజాస్వామ్య మార్గంలోకి అడుగుపెడుతున్నారు. కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' చివరి అంకానికి చేరుకోవడంతో, కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో, హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టు నేతలు ఈరోజు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన సీనియర్ నేతలు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), బడే చొక్కారావు (దామోదర్), నూనె నరసింహారెడ్డి (గంగన్న)లతో పాటు సుజాతక్క, చంద్రన్నలు ముఖ్యమంత్రిని కలిశారు. దశాబ్దాల అజ్ఞాతవాసం తర్వాత ఈ అగ్రనేతలంతా నేరుగా అధికార కేంద్రమైన సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు "సీఎంతో ఏం చర్చిస్తారు?" అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ "పొలిటికల్ ఎజెండా" అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. లొంగిపోయిన నేతల పునరావాసం, వారి కుటుంబాల భద్రతపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టబోయే తదుపరి కార్యాచరణపై సీఎంకు వివరించినట్లు సమాచారం.



### లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా: రేవంత్ రెడ్డి

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్ర నాయకులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమైన విషయం తెలిసిందే. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూమి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, ఆ తర్వాత లొంగుబాట్లపై అందరం కలిసి ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం నడవదని ప్రజలకు వివరిస్తామని అన్నారు.

# సర్‌ప్రైజ్‌లు ఇస్తా

## పార్టీ పెట్టాక చెప్తా.. గాంధీ విగ్రహం తప్పుకాదు.. కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): తాను రాజకీయ పార్టీని ప్రకటించిన తర్వాత చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రెండు నెలల్లో కొత్త పార్టీని స్థాపించబోతున్నట్లు తెలిపారు. రాజకీయం చేయాలంటే ధైర్యం ఉండాలని, ఓటమిని సైతం అంగీకరించే మనస్తత్వం ఉండాలని అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు ఇంకా ఉందని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. తనను ఐదు నెలల పాటు జైల్లో పెట్టి క్షోభకు గురిచేశారని అన్నారు. తనకు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఎవరూ పెద్దగా తెలియదని వెల్లడించారు. సంజయ్ సింగ్ ఎంపీ కాబట్టి పరిచయం ఉండేదని అన్నారు. మద్యం కేసులో క్లీన్ చిట్ వచ్చాక మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు తనను అరెస్టు చేసినప్పుడు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. సమస్యలు ఉన్నప్పుడు తాను షో చేయడానికి ఎప్పుడూ వెళ్లనని కవిత తెలిపారు. కుమ్మెర జాతర ఘటనపై తాను ఆ రోజే ఎస్పీతో మాట్లాడానని వెల్లడించారు. నిందితులకు తగిన శిక్ష పడాలని బాధిత కుటుంబం, తాము కోరుకుంటున్నామని అన్నారు. సమాజం పట్ల మన కంటే లక్ష రెట్ల అవగాహన మావోయిస్టు అగ్రనేతలకు ఉందని కవిత పేర్కొన్నారు. నేను సమాజంలో ఉండి పోరాడితే, వారు అడవుల్లో ఉంటూ సమాజం కోసం పోరాటం చేస్తున్నారని ప్రశంసించారు. మావోయిస్టులు లొంగిపోయి సిద్ధాంతాన్ని బ్రతికించారని అన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కింద గాంధీ విగ్రహం పెట్టడాన్ని తప్పుపట్టదలుచుకోలేదని కవిత తెలిపారు. కానీ ఈ ప్రాజెక్టు కోసం అన్ని ఇళ్లు కూలగొట్టడం ఎందుకని ప్రశ్నించారు.

# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రూ. 2.80 లక్షలు

## ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అండ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.2.80 లక్షల చెక్కును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియకు మోక్షం లభించనుందని మంత్రి జూపల్లి వెల్లడించారు. వారం రోజుల్లోగా సుమారు 2,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తి చేస్తామని, అనంతరం ఇతర హోదాల్లోని అధికారుల బదిలీలను దశలవారీగా చేపడతామని వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు. తెలంగాణను దేశీ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నూతన పర్యాటక విధానం ద్వారా వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారుల వెంట పర్యాటకులకు సమాచారం అందించే సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ప్రతినిధులు విష్ణు స్వరూప్ రెడ్డి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సౌమ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీకి ఇజ్రాయెల్‌పై ప్రేమెందుకు?: అసదుద్దీన్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ పట్ల ఉన్న ప్రేమ వెనుక బలమైన భావజాలం ఉందని, ఆర్ఎస్ఎస్ మరియు జియోనిస్టుల సిద్ధాంతాలు రెండూ ద్వేషం పునాదిగానే సాగుతాయని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మసీదు-ఏ-చౌక్‌లో జరిగిన 'జల్సా-ఏ-యౌమ్-ఉల్-ఖురాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. గాజాలో 73,000 మంది పాలస్తీనియన్ల మరణానికి కారణమైన ఇజ్రాయెల్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ బహిరంగ మద్దతు తెలపడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని ఒవైసీ అన్నారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని, ఆయన యూరప్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అలాంటి యుద్ధ నేరస్తుడిని ఆలింగనం చేసుకోవడం ద్వారా పాలస్తీనాకు భారత్ ఇన్నాళ్లుగా ఇస్తున్న మద్దతుకు మోదీ తూట్లు పొడిచారని విమర్శించారు. ఇజ్రాయెల్ అనేది ప్రపంచంలోనే ఏకైక జాత్యహంకార దేశమని, వెస్ట్ బ్యాంక్, గాజాలను బహిరంగ జైళ్లుగా మార్చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావించిన ఒవైసీ, ఆర్ఎస్ఎస్, జియోనిస్టుల మధ్య బంధం చాలా పాతదని ఆరోపించారు. 1960లలో జనసంఘ్ ప్రతినిధులు, 1973లో గోపాల్ గాడ్సే ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్‌ను కలిసి ముస్లిం వ్యతిరేక అజెండాపై చర్చించారని ఆయన గుర్తు చేశారు. బంగ్లాదేశ్ అంశంపై స్పందిస్తూ.. అక్కడ హిందువుల రక్షణను తాము కూడా కోరుకుంటున్నామని, అయితే శరణార్థిగా ఉన్న షేక్ హసీనాను తిరిగి బంగ్లాదేశ్ పంపిస్తే ఆ సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. దేశంలో రంజాన్ మాసంలో కూడా ముస్లింలపై ద్వేషపూరిత నేరాలు, మూక దాడులు పెరిగిపోతున్నాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు.

# చెన్నైలో విశాఖ సైబర్ దొంగ అరెస్టు

చెన్నై/హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన అంతర్జాతీయ సైబర్ నేరస్తుడ్ని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మాట్రిమోని, క్రిప్టో పెట్టుబడుల పేరిట ప్రజలను మోసం చేసిన అతడిని పెదపూడి ప్రసన్నకుమార్‌గా పోలీసులు గుర్తించారు. మ్యాట్రిమోనిలో యువతిగా ప్రొఫైల్ క్రియేట్ చేసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలువురిని మోసం చేశాడు. అతడు కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రసన్నకుమార్ ఒక మ్యాట్రిమోనియర్ వెబ్ సైట్‌లో యువతి పేరిట నకిలీ ప్రొఫైల్ సృష్టించి బాధితులను పరిచయం చేసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్నాడు. అలాగే నకిలీ క్రిప్టో ట్రేడింగ్ ద్వారా పలువురిని పెట్టుబడులకు ప్రోత్సహిస్తూ మోసం చేశాడు. ఒక బాధితుడిని నిందితుడు రూ.11 లక్షల మేర మోసం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మోసం చేయడానికి వందలాది అక్రమ సిమ్ కార్డులను సేకరించి ఫేక్ ఖాతాలు తెరిచినట్లు పోలీసులు గుర్తించారు.

# విద్యావేత్తలు లేని విద్యాకమిషన్

## మాజీమంత్రి హరీశ్ రావు ఎద్దేవా



హైదారాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు విద్యావేత్తలే లేని కమిటీని వేసి, వారితో విద్యా విధానంపై నివేదిక ఇప్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యా కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు ఎక్కడ అని ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో స్కూల్ పిల్లలకు గానీ, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు మినహా, ఎడ్యుకేషన్ లో పీహెచ్‌డీ చేసిన వాళ్లు కానీ, స్కూల్ సిలబస్ తయారీలో, కోర్ సైన్స్ సబ్జెక్టుల్లో పట్టున్న వాళ్లు కానీ ఈ కమిటీలో ఒక్కరైనా లేరని పేర్కొన్నారు. ఈ కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అని పైగా ఆయనొక ఇంజనీర్ అని అన్నారు. ఆఫీసులు నడపడం వేరు. చదువులు చెప్పడం వేరు. పరిపాలనలో అనుభవం ఉన్నంత మాత్రాన. పిల్లల సైకాలజీ, పాఠాలు చెప్పే పద్ధతుల మీద పూర్తి అవగాహన ఉన్నట్టా. తెలంగాణ విద్యా భవిష్యత్తును మార్చేంత అర్హత, నైపుణ్యం ఈ కమిటీకి ఉందని మీరు నిజంగానే నమ్ముతున్నారా అంటూ ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన విద్యా కమిషన్‌లో విద్యావేత్తలు, అనుభవం ఉన్న టీచర్లు, పిల్లల మనస్తత్వం తెలిసిన చైల్డ్ సైకాలజిస్టులు, సబ్జెక్ట్ నిపుణులు లేకుండానే రాష్ట్రానికి ఏకంగా ఒక కొత్త విద్యా విధానాన్ని తయారు చేయొచ్చనే గొప్ప ఆలోచన మీకే దక్కుతుందని పేర్కొన్నారు. సిలబస్ ఎలా ఉండాలి, బోధనా పద్ధతులు ఎలా ఉండాలి అనేది గ్రౌండ్ లెవెల్లో పాఠాలు చెబుతున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ కు తెలుస్తుంది కానీ.. అసలు ఆ సంబంధమే లేని అధికారులకు, వేరే రంగాల వారికి ఎలా తెలుస్తుందని నిలదీశారు. విద్యావ్యవస్థ మీద కనీస అవగాహన లేకుండా, అర్హత లేని వారితో ప్రయోగాలు చేయడం అంటే తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి ఎంత నిర్లక్ష్యంగా గాలికి వదిలేశారో చెప్పడానికి ఈ కమిటీ ఏర్పాటే ఒక ఉదాహరణ అని విమర్శించారు. కొత్త విద్యా విధానం విషయంలో తెలంగాణలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పారదర్శకతను కోరుకుంటున్నారని తెలిపారు. గడిచిన రెండేండ్లుగా విద్యాశాఖను గాలికి వదిలేసి, సబ్జెక్ట్ తెలిసిన విద్యావేత్తలకు ఈ బాధ్యత అప్పగించకుండా, సంబంధం లేని వారితో కమిటీ వేసి కాలయాపన చేసి ఏం సాధించినట్లని ఆరోపించారు. వేసిన కమిటీ ఎంత గొప్పగా ఉంటే, వారిచ్చిన నివేదిక ఇంకెంత గొప్పగా ఉంటుందో అర్థమవుతున్నదని, విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

# రైతు భరోసా ఎక్కడ?

## హామీల అమలేది?.. ఆందోళనలు మొదలెడతాం.. రేవంత్ రెడ్డికి బండి బహిరంగ లేఖ

కరీంనగర్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోవడం లేదని ఆ లేఖలో విమర్శించారు. ఎన్నికలకు ముందు హామీలివ్వడం, ఆ తర్వాత మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. రైతు భరోసా నిధులు ఇప్పటి వరకు జమ చేయలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు వేస్తామని మిర్యాలగూడ వేదికగా ఫిబ్రవరి 4న మీరే ప్రకటించారు, మీ మాటను మీరే విస్మరిస్తే ఎలా అని ముఖ్యమంత్రిని నిలదీశారు. లక్షలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్ల బకాయిలు ఇవ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. తక్షణమే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. నిధులు విడుదల చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పేదల ఇళ్లను కూల్చడంలో



రేవంత్ రెడ్డి ఉత్సాహం చూపిస్తున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కేసీఆర్‌ను మించిపోయారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# కవితకు క్లీన్ చిట్ రాలేదు: అర్వింద్



నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఢిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు క్లీన్ చిట్ రావడంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కవిత సహా పలువురికి ఊరట కలిగిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. సీబీఐ నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేసింది. ఈ అంశంపై ఎంపీ అరవింద్ స్పందిస్తూ, ఈ కేసులో సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు తెలిపిందని, కానీ క్లీన్ చిట్ ఇవ్వలేదని వెల్లడించారు. కవిత ఆరోపిస్తున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ ఒక్కటి కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతుంటారని, వాటన్నింటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. కవితకు క్లీన్ చిట్ రావడంపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా స్పందించారు. ఇది బీజేపీ రాజకీయ డ్రామాగా ఆయన అభివర్ణించారు. పార్టీలు, నాయకులతో అవసరం ఉంటే ఒకలా, అవసరం తీరాక మరోలా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. శత్రువు మిత్రుడు కావొచ్చు మిత్రుడు శత్రువు కావొచ్చని విమర్శించారు.

# హైడ్రా పేరుతో ఇబ్బందులు: ఈటల

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): హైడ్రా పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కానీ పెద్దల జోలికి వెళ్లడం లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగడాలకు కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూసీ పునరుజ్జీవనం పేరుతో నిరుపేదలు, సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మధు రిట్జ్ అపార్ట్‌మెంట్ వాసులకు తాము అండగా నిలబడతామని ఈటల హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నందుకు పేదలకు మంచి జరిగే పనులు చేయాలి తప్ప వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని హితవు పలికారు. ప్రభుత్వం మూడు నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్సుమెంట్స్ బకాయిలు క్లియర్ చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలేజీలు ఇబ్బంది పడుతున్నాయని వాపోయారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం విశ్రాంత ఉద్యోగులు ఈ వయస్సులో సచివాలయం చుట్టు చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతోనే ఖమ్మంలో ఇళ్లను కూల్చివేస్తున్నామని జిల్లా కలెక్టర్ చెబుతున్నారని, న్యాయస్థానాలు కూడా పేదల జీవితాలను దృష్టిలో ఉంచుకుని తీర్పులు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదలు 40 నుంచి 50 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారని, అలాంటి ఇళ్లను నేలపట్టం చేశారని మండిపడ్డారు.

# రాజ్యసభ సీట్లు వీహెచ్, జెట్టికివ్వాలి

### ఢిల్లీలో ఖర్గేతో జగ్గారెడ్డి మంతనాలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కావడంతో వాటిని పార్టీలో కీలక నేతలైన వారికి ఇవ్వాలంటూ హస్తినలో పర్యటిస్తున్నారు. ఇప్పుడు ఈ వార్త సంచలనంగా మారింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో జగ్గారెడ్డి భేటీ అయిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. రాజ్యసభ స్థానం కోసం వెళ్లినట్లు ఉన్నారని అంతా భావించారు. కానీ జగ్గారెడ్డి ఆ భేటీపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. తెలంగాణలో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలపై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండు స్థానాలను పార్టీలో సీనియర్ నేతలకు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతోపాటు కాంగ్రెస్ ముఖ్య నేతలను కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అయిన వీ హన్మంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకు ఇవ్వాలంటూ అధిష్టానాన్ని కోరారు. ఇదే విషయమై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో చర్చించినట్లు తెలిపారు. మల్లిఖార్జున ఖర్గేను మాత్రమే కలిసిన జగ్గారెడ్డి వీహెచ్, జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరారు. వారికి రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్, స్టూడెంట్ లీడర్ కమ్మ సామాజిక నుంచి ఉన్నాడు. కమ్మ నాయకుడుగా జెట్టి కుసుమ కుమార్‌కి అవకాశం ఇవ్వాలి'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కోరినట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్. వాళ్ళ కుటుంబం నుంచి అందరూ కాంగ్రెస్‌లోనే ఉన్నారు అని గుర్తు చేశారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత వి హన్మంతరావు అనేకమంది ముఖ్యమంత్రులతో కలిసి పని చేశారు. మూడు సార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారు అని మల్లిఖార్జన ఖర్గేకు వివరించారు. 'వయసులో పెద్ద వ్యక్తి, చురుకైన వ్యక్తి కాబట్టి మరోసారి అవకాశం ఇవ్వండి. ఖర్గే కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తాం'అని జగ్గారెడ్డి తెలిపారు.





## అష్టలక్ష్మి ఆలయంలో వసంతోత్సవం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని అష్ట లక్ష్మి సహిత లక్ష్మీనారాయణ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అన్ని రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. ఆద్యంతం కన్నులపండువగా సాగిన ఈ సన్నివేశాన్ని పెద్ద ఎత్తున భక్తులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ గరిపెల్లి శమంత, డాక్టర్ శశికుమార్-వందన దంపతులు, భక్తులు పాల్గొన్నారు. కాగా, శనివారం తెప్పోత్సవం, ఆదివారం ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శమంత తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## అక్రెడిటేషన్ల గడువు రెండ్నెల్లు పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో 2 నెలల పాటు పొడిగిస్తూ ఇవాళ సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈనెల 28న ముగియాల్సి ఉంది. అయితే, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉండటం, అలాగే సమావేశాల నిర్వహణకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వర్కింగ్ జర్నలిస్టులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రస్తుత కార్డుల గడువును మార్చి 1, 2026 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు అంటే 2 నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంపీసీ చైర్మన్లకు సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక లేఖ రాశారు. అందులో ప్రస్తుతం ఉన్న జిల్లా జర్నలిస్టు అక్రెడిటేషన్ కార్డుల గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు అమలులో ఉండేలా చూడాలని ఆమె కోరారు.



## నా ఆరోగ్యం గురించి ఆందోళన వద్దు: బొత్స

వైజాగ్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): తాను ఆరోగ్యంగానే ఉన్నానని వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స నారాయణ తెలిపారు. తన ఆరోగ్యం గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రొటీన్ హెల్త్ చెకప్ లో భాగంగానే తాను ఆసుపత్రికి వచ్చానని వెల్లడించారు. ఈ మేరకు ఆయన వివరణ ఇచ్చారు. బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్ అంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆయన క్లారిటీ ఇచ్చారు. అటు, బొత్స కుటుంబ సభ్యులు కూడా ఈ ప్రచారాన్ని ఖండించారు.

## ఓయూ విద్యార్థి జేఏసీ నేత అశోక్ యాదవ్‌కు సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ-హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఉస్మానియా విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు, ఉద్యమకారుడు అశోక్ యాదవ్‌కు విద్యార్థిజన సమితి ఓయూ అధ్యక్షుడు కడారి రమేశ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఓయూ లా కాలేజీలో ప్రొఫెసర్ ఎస్‌బీ ద్వారకనాథ్ పర్యవేక్షణలో 'లీగల్ ఇష్యూస్ రిలేటింగ్ టు ల్యాండ్ అక్విజిషన్ ఇన్ తెలంగాణ స్టేట్- ఏ కేస్ స్టడీ ఆన్ మేజర్ ప్రాజెక్ట్స్' అంశంపై పరిశోధన పూర్తి చేసి, వైవాను విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు శివశంకర్ యాదవ్, భాస్కర్, దాసరి తిరుమలేశ్, అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్



అమరావతి, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ పదవీ కాలం రేపటితో (ఫిబ్రవరి 28) ముగియనుంది. ఈ నేపథ్యంలో, విజయానంద్ స్థానంలో సాయిప్రసాద్ ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రేపు ఉదయం సచివాలయంలో కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలను స్వీకరిస్తారు. 1991 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ 'ఎంటెక్' చదివారు. సివిల్ సర్వీసులోకి ప్రవేశించి 1992లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1993-95 మధ్య పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా గిరిజన ప్రాంతాల్లో సేవలందించారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా... 1997-98 మధ్య కాలంలో కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. సాయి ప్రసాద్ విద్యుత్ రంగం, గృహనిర్మాణ రంగాల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ, ఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా సేవలందించారు. 2011 నుంచి 2014 వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖలో సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేశారు. సాయిప్రసాద్ 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీగా, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఇప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

## కోనసీమ జిల్లాలో పరువు హత్య

**చెల్లిని పెళ్లి చేసుకున్నాడని యువకుడిని చంపేసిన అన్నలు**



కోనసీమ జిల్లా, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తమ చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే కోపంతో ఇద్దరు సోదరులు ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. కులాంతర వివాహం చేసుకోవడమే ఈ దారుణానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి శివారు వేములపల్లిలో వస్త్ర వ్యాపారం చేసుకునే పీవీవీ సూర్యప్రకాశరావు(41), రాయవరంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అయినవిల్లి సంధ్య కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ హైస్కూలు స్నేహితులు కావడం విశేషం. సూర్యప్రకాశరావుది తమ కులం కాకపోవడంతో సంధ్య కుటుంబం వీరి ప్రేమను తిరస్కరించింది. అయినా సరే, ఒకటవ్వాలని నిశ్చయించుకున్న ఈ జంట గురువారం ఉదయం అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత సంధ్యను తీసుకుని సూర్యప్రకాశరావు వేములపల్లిలోని తన నివాసానికి వెళ్లారు. తమ చెల్లెలి పెళ్లి విషయం తెలిసి సూర్యప్రకాశరావుపై సంధ్య సోదరులు చంద్రపాల్, గిరిబాబు కక్ష పెంచుకున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో సూర్యప్రకాశరావు ఇంటిపై దాడి చేసిన నిందితులు.. అతడిని బయటకు లాగి బండరాయితో ముఖంపై చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాశరావు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న స్థానికులు నిందితులను పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన మండపేట రూరల్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లైన 24 గంటలు గడవకముందే భర్త కళ్లముందే విగతజీవిగా పడి ఉండటం చూసి భార్య సంధ్య శోకసముద్రంలో మునిగిపోయింది.

# శోభాయమానం.. శ్యామ్ నిషాన్ యాత్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): రాధేశ్యామ్ నామస్మరణలు మార్మోగాయి. రంగురంగుల జెండాలతో సాగిన నిషాన్ యాత్రతో కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని శ్యామ్ బాబా మందిర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కలియుగ కృష్ణుడిగా భావించే శ్యామ్ బాబా తన శిరస్సును శ్రీ కృష్ణుడికి దానమిచ్చిన రోజును పురస్కరించుకుని నిర్వహించే పాల్గున్ మహోత్సవం శుక్రవారం శ్యామ్ మందిర్ లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్యామ్ మందిర్ లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశామహల్ నుంచి కాచిగూడ శ్యామ్ మందిర్ వరకు భక్తులు ప్రత్యేక శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచిగూడ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి భక్తులకు ఆయన స్వాగతం ఫలికారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు రంగు రంగుల జెండాలతో నిషాన్ శోభాయాత్రలు నిర్వహించారు. గుర్రాలు, ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాలతో యాత్రలో పాల్గొన్నారు. రథాలపై శ్రీకృష్ణుడి చిత్రపటాలుంచి ఊరేగించారు. ఈ ఊరేగింపునకు శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, కృష్ణకుమార్ బడేగావ్వాలే, రాజ్ కుమార్ విగ్, కపిల్ అగర్వాల్ తదితరులు స్వాగత వేదిక నుంచి ఘన స్వాగతం పలికారు. విజయ్, లాలు, చింటు, ఇషాన్, ఆనంద్, కేశవ్, విషాల్ రవి, కిరణ్, శ్యామ్, హిమాన్షు, క్రిష్ణ, రాహుల్, శ్రావణ్, పవన్, తన్వీ, తదితర భక్తులు పాల్గొని శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు. శ్యామ్ బాబా కు 56 రకాల మిఠాయిల నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే శ్యామ్ బాబా విగ్రహాన్ని రకరకాల పూలు, పళ్లతో అలంకరించారు.



# సఖి సెంటర్‌లో యువకుడిపై కత్తులతో దాడి

మల్యాల/జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న సఖీ సెంటర్ ఆవరణలో ప్రేమ వివాహం చేసుకున్న యువకుడిపై అమ్మాయి తరపు బంధువులు కత్తులతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. మల్యాల మండలం లంబాడిపెల్లి గ్రామానికి చెందిన ఎనగందుల అనిల్ అదే మండలానికి చెందిన ఓ యువతిని ఈ నెల 21న ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం అమ్మాయి కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కౌన్సెలింగ్ నిమిత్తం యువతిని జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం యువతిని కలిసేందుకు అనిల్ సఖి సెంటర్‌కు వచ్చాడు. ఇదే సమయంలో పక్కా ప్లాన్‌తో ఉన్న అమ్మాయి తరపు బంధువులు సఖి సెంటర్ ఆవరణలోనే అనిల్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్రంగా కొట్టడమే కాకుండా కత్తితో దాడి చేయడంతో అనిల్ గాయపడ్డాడు. సఖి సెంటర్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



# ఏపీలో పాలు, నీళ్లూ ప్రాణాంతకమే

**బాబు సర్కారు నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలు.. శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనల్లో డజనుకు పైగా మృతి**

**మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్**



తాడేపల్లి, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు. గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు కోరుకోవడం లేదని, మరిన్ని ప్రాణాలు పోకముందే మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని జగన్ పేర్కొన్నారు.

# చంద్రబాబుకు దగ్గరపడింది: లక్ష్మీపార్వతి

విజయవాడ, ఫిబ్రవరి 27 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు 'కుట్రలకు కేరాఫ్ అడ్రస్' అని ఆమె అభివర్ణించారు. నిస్సిగ్గు రాజకీయాలకు ఆయన కేరాఫ్ అడ్రస్ అని, చేసిన పాపాలకు శిక్ష అనుభవించే కాలం దగ్గరపడిందని మండిపడ్డారు. తిరుమల లడ్డూ వివాదంపై స్పందిస్తూ... దేవుడిపై నమ్మకం లేని చంద్రబాబు, రాజకీయ లబ్ధి కోసమే ప్రసాదాన్ని వివాదాల్లోకి నెట్టారని ఆరోపించారు. లడ్డూలో కల్తీ నెయ్యి వెనుక హెరిటేజ్ హస్తం ఉందని తేలింది అని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ అవసరాల కోసం ఎన్టీఆర్ కుటుంబాన్ని వాడుకుని వదిలేశారని, చివరకు మోదీ, కాంగ్రెస్ నాయకత్వాలను కూడా తన స్వార్థం కోసం వాడుకున్నారని విమర్శించారు. లక్షల కోట్లు సంపాదించాలనే లక్ష్యం తప్ప చంద్రబాబుకు ప్రజా శ్రేయస్సు పట్టదని, రాయలసీమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆ ప్రాంతానికి వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. జగన్, వైవీ సుబ్బారెడ్డి కుటుంబాలపై చేస్తున్న వ్యక్తిగత ఆరోపణలు ఆయన నీచ రాజకీయాలకు పరాకాష్ఠ అని లక్ష్మీపార్వతి దుయ్యబట్టారు.

## ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ లీసా గిల్!

**కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) సరికొత్త చరిత్రకు సిద్ధమవుతోంది. ఏపీ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా (సీజే) జస్టిస్ లీసా గిల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి కీలక సిఫారసు చేసింది. ప్రస్తుతం ఆమె పంజాబ్ - హర్యానా హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేంద్రం నుంచి అధికారిక ముద్ర పడడమే తరువాయి, ఆమె అమరావతిలో బాధ్యతలు చేపట్టనున్నారు. సాధారణంగా ఒక ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేసిన తర్వాత కొత్తవారి నియామకం జరిగేది. కానీ, ఈసారి సుప్రీంకోర్టు కొలీజియం తన పనితీరులో కీలక మార్పు తెచ్చింది. ప్రస్తుత సీజేలు రిటైర్ కావడానికి రెండు నెలల ముందే వారి వారసుల పేర్లను కేంద్రానికి పంపిస్తోంది. న్యాయపాలనలో ఎక్కడా విరామం లేకుండా చూడటం, పరిపాలనాపరమైన జాప్యాన్ని నివారించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన కారణం. మరోవైపు, మద్రాస్ హైకోర్టు సీజేగా జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ ధర్మాధికారి ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు.

## 90 రోజుల్లో 'సోషల్ మీడియా' ఫ్రేమ్‌వర్క్: నారా లోకేశ్

ముంబై: ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సులో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో తాను నిర్వహిస్తున్న 'రెడ్ బుక్'లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను, సాధారణ ప్రజలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారని లోకేశ్ ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులు, చిత్రహింసలకు గురిచేసిన వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు.

# వద్దు.. అమెరికా!

## తగ్గుతున్న భారతీయ విద్యార్థులు

### మేనేజ్‌మెంట్ వర్సిటీల్లో భారీగా పడిపోయిన చేరికలు



న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంగా ఉన్నత చదువుల కోసం అమెరికా బాట పట్టిన భారతీయ విద్యార్థుల ధోరణిలో అనూహ్య మార్పు కనిపిస్తోంది. అమెరికాలోని మేనేజ్‌మెంట్ వర్సిటీల్లో భారతీయ విద్యార్థుల చేరికలు ఈ ఏడాది ఏకంగా 45 శాతం పడిపోయాయి. అదే సమయంలో స్వదేశీ బిజినెస్ స్కూల్స్‌లో చేరే వారి సంఖ్య 25 శాతం పెరగడం గమనార్హం. ఈ మేరకు 'గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్' తన 2025 వార్షిక నివేదికలో సంచలన విషయాలను వెల్లడించింది. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా ఉన్న అమెరికా, ప్రస్తుతం తన ప్రాభవాన్ని కోల్పోతోంది. దీనికి ప్రధానంగా మూడు కారణాలను నివేదిక విశ్లేషించింది. వీసా చిక్కులు.. 2025 మే నెలలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సోషల్ మీడియా వెరిఫికేషన్ నిబంధనల పేరుతో వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయడం పెద్ద దెబ్బ తీసింది. అడ్మిషన్లు పొంది, డిపాజిట్లు కట్టినప్పటికీ వేలాది మంది విద్యార్థులు సకాలంలో వీసాలు పొందలేకపోయారు. ఉద్యోగ భద్రతపై ఆందోళన.. చదువు పూర్తయిన తర్వాత లభించే ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్), హెచ్-1బీ వీసా నిబంధనలు కఠినతరం అవుతాయనే భయం విద్యార్థుల్లో పెరిగింది. భారీగా ఖర్చు చేసి చదివిన తర్వాత అక్కడ ఉద్యోగం దొరకకపోతే ఆర్థికంగా నష్టపోతామని విద్యార్థులు భావిస్తున్నారు. రూపాయి బలహీనత.. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఆల్-టైమ్ కనిష్టానికి పడిపోవడంతో, అమెరికాలో చదువు భారం పెరిగింది. దీంతో విద్యార్థులు తక్కువ ఖర్చుతో కూడిన యూరప్ లేదా ఆసియా దేశాల వైపు మొగ్గు చూపుతున్నట్లు నివేదికలో పేర్కొంది. అమెరికాలో అడ్మిషన్లు తగ్గుతుంటే, భారతదేశంలోని మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు డిమాండ్ పెరుగుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య స్వదేశంలోనే అందుబాటులో ఉండటం, అప్లికేషన్ల సంఖ్య 25 శాతం పెరగడానికి కారణమైంది. కేవలం భారతీయులే కాకుండా, విదేశీ విద్యార్థులు కూడా భారతీయ బి-స్కూల్స్‌పై ఆసక్తి చూపిస్తుండటం విశేషం. అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయంగా భారతీయ విద్యార్థులు ఇప్పుడు యూరప్ (బ్రిటన్ మినహా), సింగపూర్, ఇతర ఆసియా దేశాల వైపు చూస్తున్నారు. వీసా నిబంధనలు సరళంగా ఉండటం, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య లభించడమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## బెంగళూరు హోటల్‌లో 30 మంది ఎమ్మెల్యేలు

### సీఎం మార్పుపై అధిష్ఠానంపై డీకే ఒత్తిడి?

**విదేశీ పర్యటనలో సిద్ధరామయ్య వర్గం**

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గానికి చెందిన దాదాపు 30 మంది ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రహస్యంగా సమావేశం కావడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక అని పైకి చెబుతున్నప్పటికీ అధికార మార్పిడిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండున్నరేళ్ల తర్వాత పదవిని తనకు అప్పగిస్తారనే ఒప్పందం ఉందని డీకే శివకుమార్ వర్గం బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన బలాన్ని నిరూపించుకునేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే, ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ సమావేశంలో ఇద్దరు మంత్రులు కూడా పాల్గొనడం గమనార్హం. డీకే శివకుమార్ వర్గం ఇక్కడ సమావేశమైన సమయంలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న 20 మందికి పైగా ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలో ఉన్నారు. వారు మార్చి 1న తిరిగి రానున్నారు. మరోవైపు, ఈ పరిణామాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ నాయకత్వ మార్పుపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతానికి ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య మద్దతుదారులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. ఒకవేళ ముఖ్యమంత్రిని మార్చాల్సి వస్తే, దళిత నేతకు (మల్లికార్జున ఖర్గే లేదా జి. పరమేశ్వర) అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మార్చిలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు జరగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఇప్పుడే అయిపోలేదు: ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో దిగువ కోర్టు ఇచ్చి ఈ తీర్పుపై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు మాత్రమేనని, పై కోర్టుల్లో న్యాయం జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను ఎలా తారుమారు చేశారో అందరికీ తెలుసని ఆరోపించిన ఆమె, "ఒకవేళ మీరు (కేజ్రీవాల్) నిజంగా నిర్దోషి అయితే, విచారణ మొదలవ్వగానే ఆ మద్యం విధానాన్ని ఎందుకు వెనక్కి తీసుకున్నారు?" అని ప్రశ్నించారు. ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగినట్లు గతంలో కోర్టులు కూడా ఆందోళన వ్యక్తం చేశాయని ఆమె గుర్తు చేశారు. అలాగే కేజ్రీవాల్ ఇప్పటికీ ప్రజల ముందు డ్రామాలు చేస్తున్నారని, ఆప్ ప్రభుత్వంలో ఢిల్లీలో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని రేఖా గుప్తా విమర్శించారు. కేజ్రీవాల్ హయాంలో ప్రవేశపెట్టిన ప్రతి పథకంలోనూ ఏదో ఒక అవినీతి కుంభకోణం బయటపడుతూనే ఉందని మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలు ఇప్పటికే ఆయనను ఎన్నికల్లో ఓడించి సరైన తీర్పు ఇచ్చారని, న్యాయస్థానం కూడా అంతిమంగా దోషులకు శిక్ష పడేలా న్యాయం చేస్తుందని తాను నమ్ముతున్నట్లు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మీడియాతో చెప్పుకొచ్చారు. దాదాపు 900 రోజులుగా న్యాయ స్థానంలో విచారణ జరుగుతుండగా.. రౌస్ అవెన్యూ కోర్టు ఈ రోజు ఇచ్చిన తీర్పుపై సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ లిక్కర్ స్కాం కేసులో మరోసారి న్యాయ పోరాటం మొదలైంది.

# రియల్ మీ.. యువత ఫేవరేట్!

**కెమెరా, బ్యాటరీ లైఫ్ సూపర్.. వినియోగదారుల సంతృప్తిలో నం.1.. అత్యధిక నెట్ ప్రమోటర్ స్కోర్**




న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ, భారతీయ యువతలో తన పట్టును మరింత బలోపేతం చేసుకుంటోంది. తాజాగా విడుదలైన 'సీఎంఆర్ కన్స్యూమర్ ఇన్‌సైట్ సర్వే 2026'లో 'యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్'గా రియల్‌మీ నిలిచింది. వినియోగదారుల నుంచి లభిస్తున్న అధిక సంతృప్తి, ప్రత్యేకించి జనరేషన్ జెడ్, మిలీనియల్స్‌లో బలమైన ఆదరణే ఇందుకు కారణమని సర్వే వెల్లడించింది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో నిర్వహించిన ఈ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుత యువత శక్తివంతమైన పనితీరు, నమ్మకమైన బ్యాటరీ లైఫ్, తమ వ్యక్తిత్వానికి అద్దం పట్టే డిజైన్‌ను కోరుకుంటున్నారని స్పష్టమైంది. కొత్త ఫోన్ కొనుగోలులో కెమెరా క్వాలిటీ (86 శాతం), ఫాస్ట్ ఛార్జింగ్‌తో కూడిన బ్యాటరీ లైఫ్ (79 శాతం) కీలక పాత్ర పోషిస్తున్నాయని తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 74 శాతం మంది రోజుకు నాలుగు గంటలకు పైగా ఫోన్‌పైనే గడుపుతున్నట్లు తెలిసింది. వినియోగదారుల సంతృప్తిలో ఇతర బ్రాండ్లతో పోలిస్తే రియల్‌మీ అగ్రస్థానంలో నిలవడంతో పాటు, అత్యధికంగా 81 నెట్ ప్రమోటర్ స్కోర్ (ఎన్పీఎస్) సాధించింది. ఈ ఫలితాలపై రియల్‌మీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఫ్రాన్సిస్ వాంగ్ మాట్లాడుతూ.. "సీఎంఆర్ సర్వేలో మా బ్రాండ్‌కు లభించిన గుర్తింపు, యువత మాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. మా పనితీరు, ఆవిష్కరణలు, కెమెరాపై వారి విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. స్మార్ట్‌ఫోన్లతో పాటు, టీడబ్ల్యూఎస్ (ట్రూ వైర్‌లెస్ స్టీరియో) విభాగంలో కూడా రియల్‌మీ డిజైన్, బ్యాటరీ లైఫ్ విషయంలో మంచి సంతృప్తిని నమోదు చేస్తున్నట్లు సర్వే పేర్కొంది. డిజైన్, కెమెరా వంటి మెరుగైన ఫీచర్ల కోసం వచ్చే ఏడాదిలోపు కొత్త ఫోన్ కొనుగోలు చేసేందుకు 50 శాతానికి పైగా యువ వినియోగదారులు సిద్ధంగా ఉన్నారని ఈ నివేదిక వెల్లడించింది.

# వారం వరకు వీవీప్యాట్ వెరిఫై: సీఈసీ

న్యూఢిల్లీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కౌటింగ్ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీప్యాట్ల స్లిప్పులను వెరిఫై చేసుకోవడానికి అభ్యర్థులకు అనుమతి ఇచ్చింది. అయితే అందుకు కొంత మొత్తం చెల్లించాలని చెన్నైలో జరిగిన కార్యక్రమంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై ఈసీ సమీక్ష జరిపింది. 'తమిళనాడులోని 75,000 పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ నిర్వహించిన సర్ ప్రక్రియ దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈవీఎం రౌండ్ల కంటే ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంట్ చేసేలా నిర్ణయం తీసుకున్నాం' అని



జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు.

**తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్!**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నిర్వహించాలని పలు పార్టీలు సూచించినట్టు సీఈసీ తెలిపారు. వారి విజ్ఞప్తులను వివిధ కోణాల నుంచి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడే దీనిపై ఒక స్పష్టత ఇస్తామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై జ్ఞానేశ్ కుమార్ శుక్రవారంనాడు సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో జరిపిన ఎస్ఐఆర్ ప్రక్రియ దేశానికే ఒక మోడల్‌గా నిలిచిందని, విజయవంతంగా ఈ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఎస్ఐఆర్‌తో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్టు కొన్ని రాజకీయల పార్టీలు విమర్శించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ అధికారులు ఎంతో ప్రొఫెషనలిజం కనబరిచారని ప్రశంసించారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహిస్తామని, సరికొత్త రికార్డు సృష్టిస్తామని తెలిపారు.



# పన్నీర్ సెల్వం డీఎంకే తీర్థం

### తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం

**డీఎంకేను తల్లిలాంటి పార్టీగా అభివర్ణించిన పన్నీర్**

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాల్లో కనీవినీ ఎరుగని భారీ మార్పు చోటుచేసుకుంది. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత నమ్మకస్తుడు, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏఐఏడీఎంకే మాజీ నేత పన్నీర్‌సెల్వం అధికార ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే)లో చేరారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ఉదయం చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్న అరివాలయం' ఒక్కసారిగా సందడిగా మారింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, పన్నీర్ సెల్వం తన కుమారుడు రవీంద్రన్‌తో కలిసి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. స్వయంగా సీఎం స్టాలిన్ ఆయనకు ఆహ్వానం పలికారు. పార్టీ కండువా కప్పి డీఎంకేలోకి సాదరంగా ఆహ్వానించారు. డీఎంకేలో చేరిన అనంతరం పన్నీర్ సెల్వం భావోద్వేగంగా మాట్లాడారు. డీఎంకేను 'తల్లిలాంటి పార్టీ'గా అభివర్ణించారు. "అరిగ్నర్ అన్నా, కలైంజ్ఞర్ కరుణానిధి నిర్దేశించిన మార్గంలో పయనిస్తూ స్టాలిన్ అద్భుతమైన పాలన అందిస్తున్నారు. గత ఐదేళ్లలో ఆయన అందించిన అభివృద్ధిని చూసి దేశమంతా ఆశ్చర్యపోతోంది. అందుకే వారి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నాను" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా ముద్రపడ్డ నేత, దశాబ్దాల రాజకీయ ప్రత్యర్థి పార్టీలో చేరడం ఏఐఏడీఎంకే శ్రేణులకు పెద్ద షాక్ అనే చెప్పాలి.

# ట్రంప్ చెప్పిందంతా అబద్ధం

### ఇరాన్ క్షిపణులపై నిఘా వర్గాల వెల్లడి

పెంటగాన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్' లో ఇరాన్ క్షిపణి సామర్థ్యంపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీశాయి. ఇరాన్ అభివృద్ధి చేస్తున్న అత్యాధునిక క్షిపణులు త్వరలోనే అమెరికా గడ్డను తాకే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ను ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఈ విషయంలో అధ్యక్షుడి మాటలను అమెరికా సొంత నిఘా సంస్థలే తోసిపుచ్చాయి. ఇరాన్ కు అంత సామర్థ్యంలేదని, ఇప్పట్లో అది సాధ్యం కాదని చెప్పాయి. దీంతో వైట్ హౌస్ లో భేదాభిప్రాయాలు ముదిరాయి. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) నివేదికల ప్రకారం.. ఒక పూర్తిస్థాయి ఖండాంతర క్షిపణిని తయారు చేయడానికి ఇరాన్ కు 2035 వరకు సమయం పడుతుంది. ఒకవేళ చైనా లేదా ఉత్తర కొరియా వంటి దేశాలు సాంకేతిక సాయం అందించినా సరే కనీసం ఎనిమిదేళ్ల వరకు ఇరాన్ అమెరికాను తాకగలిగే క్షిపణిని సిద్ధం చేయలేదని మూడు ఇంటెలిజెన్స్ వర్గాలు ధ్రువీకరించాయి. ట్రంప్ తన వాదనను అతిశయోక్తిగా చెబుతున్నారని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కొట్టిపారేశారు. తాము ఉద్దేశపూర్వకంగానే తమ క్షిపణుల పరిధిని 2000 కిలోమీటర్లకు పరిమితం చేశామని, ఇది కేవలం ప్రాంతీయ రక్షణ కోసమేనని ఆయన స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ.. ఇరాన్ అటువంటి సామర్థ్యాల దిశగా అడుగులు వేస్తోందని వ్యాఖ్యానించారు.






# సిమ్ లేకుంటే వాట్సాప్ బంద్

**మార్చి 1 నుంచి కొత్త నిబంధనలు!**

న్యూఢిల్లీ: మార్చి 1వ తేదీ నుంచి వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్‌లకు ఫోన్‌లలో యాక్టివ్ సిమ్ కార్డు తప్పనిసరి. ఈ యాప్స్‌కు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిబంధన అమల్లోకి వస్తే, సిమ్ లేకుండా మెసేంజర్ యాప్స్ ఫోన్‌లో పనిచేయవు. గత సంవత్సరం నవంబరులో ఈ నిబంధనలు ప్రకటించినప్పటికీ, వీటిని అమలు చేయడానికి ఆయా సంస్థలకు ప్రభుత్వం ఫిబ్రవరి 28 వరకు గడువు ఇచ్చింది. గడువు రేపటితో ముగియనున్నందున, ఎల్లుండి నుంచి సిమ్ లేకుంటే ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయకపోవచ్చు. ఎవరైనా సిమ్ లేకుంటే యాప్స్ ఉపయోగిస్తుంటే కనుక ఆ ఫోన్‌లలో ఈ యాప్ నిలిచిపోతుంది. వాట్సాప్ వెబ్ కూడా ప్రతి ఆరు గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనను తీసుకువచ్చింది. దీంతో ఈ యాప్స్‌కు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధన అమల్లోకి వస్తే ఫోన్‌లో సిమ్ కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు నిలిచిపోతాయి. వాట్సాప్ వెబ్‌ను ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి.

# కేజ్రీ.. దేశం కోసం పనిచేయ్!

**అన్నాహజారే కీలక సూచన**

ముంబై: కేజ్రీవాల్, సిసోడియాకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని అన్నా హజారే స్వాగతించారు. న్యాయవ్యవస్థ అత్యున్నతమైనదని, ఈ వ్యవస్థ లేకుంటే గందరగోళ పరిస్థితి, అశాంతి నెలకొంటుందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో కోర్టు తీర్పును అందరూ స్వాగతించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో తాను కేజ్రీవాల్‌పై విమర్శలు చేసినప్పుడు, కోర్టు అప్పటికింకా ఎలాంటి తీర్పును వెలువరించలేదని వివరణ ఇచ్చారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఆయన సలహా ఇచ్చారు. వ్యక్తిగతంగా లేదా పార్టీ గురించి మాత్రమే ఆలోచించకుండా సమాజం, దేశం కోసం పనిచేయాలని హితవు పలికారు. ఇంత పెద్ద దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు, కులాలు, మతాలు ఉన్నప్పటికీ న్యాయవ్యవస్థ వల్లే దేశం సరైన మార్గంలో నడుస్తోందని అన్నారు. బలమైన న్యాయవ్యవస్థ లేకుంటే నేరస్థులదే పైచేయి అవుతుందని వ్యాఖ్యానించారు.

# ఇజ్రాయెల్‌ను వీడండి: అమెరికా

వాషింగ్టన్: ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ, ఇజ్రాయెల్‌ను వెంటనే వీడాలని అమెరికా రాయబారి మైక్ హకబీ అక్కడి ఎంబసీలోని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్, అమెరికా మధ్య గత కొన్నాళ్ళుగా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఈ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఇజ్రాయెల్‌ను వీడి స్వదేశానికి వెళ్లాలని సూచించారు. సిబ్బంది అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేదని, కానీ ఇరాన్‌పై అమెరికా భీకర దాడికి ముందే ఇజ్రాయెల్‌ను వీడితే మంచిదని సూచించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు దిగే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. తమతో అణుఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలు చేసినప్పటికీ అణు ఒప్పంద చర్చలు అంత ఫలప్రదంగా ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఇజ్రాయెల్‌లోని తన ఎంబసీకి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తమపై దాడి చేస్తే ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు అమెరికాకు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను నాశనం చేస్తామని ప్రకటించింది.

# ఒకే కాన్పులో ఐదుగురికి జన్మ

బీజింగ్: చైనాలోని షిన్జియాంగ్ ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల యువతి దిలి ఒకేసారి ఐదుగురు బిడ్డలకు జన్మనిచ్చి అరుదైన రికార్డు సృష్టించింది. వైద్య చరిత్రలోనే ఇది అత్యంత విశేషమైన ఘట్టంగా వైద్యులు అభివర్ణిస్తున్నారు. వుహాన్ యూనివర్సిటీ ఆసుపత్రిలో సుమారు 20 మంది వైద్య నిపుణులు, నర్సుల బృందం సమిష్టి కృషితో ఈ క్లిష్టమైన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రసవంలో నలుగురు ఆడ శిశువులు, ఒక మగ శిశువు క్షేమంగా జన్మించారు. వైద్యుల వివరాల ప్రకారం, సహజ సిద్ధంగా ఒకేసారి ఐదుగురు పిల్లలు పుట్టే అవకాశం సుమారు ఆరు కోట్ల ప్రసవాల్లో ఒక్కసారి మాత్రమే ఉంటుందని తెలిపారు. తమ 40 ఏళ్ల వైద్య సేవా ప్రయాణంలో ఇలాంటి అరుదైన ప్రసవాన్ని చూడటం ఇదే తొలిసారి అని కొందరు సీనియర్ వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం పుట్టిన ఐదుగురు శిశువుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వారిని ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉంచామని ఆసుపత్రి వర్గాలు వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. గర్భధారణ సమయంలో అధిక ప్రమాదాలు ఉండటంతో ముందస్తు ప్రణాళికతో వైద్య బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాగా, ఈ ఘటన నెట్టింటా వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ చిన్నారులను ప్రేమగా 'మిరాకిల్ బేబీస్' అంటూ పిలుస్తున్నారు. సహజ సిద్ధంగా ఐదుగురు శిశువులు జన్మించడం ప్రపంచవ్యాప్తంగా అరుదైన విషయమై ఉండటంతో ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

# స్వామి అవిముక్తేశ్వరానంద్‌కు ఊరట

లక్నో: ఉత్తర ప్రదేశ్ లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన లైంగిక వేధింపుల కేసులో స్వామి అవిముక్తేశ్వరానంద్‌కు ఊరట లభించింది. ప్రయాగ్‌రాజ్‌లోని ఝూన్సీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో, భారతీయ న్యాయ సంహిత కేసులో స్వామి అవిముక్తేశ్వరానంద్‌ను అరెస్టు చేయకుండా అలహాబాద్ హైకోర్టు స్టే విధించింది. జస్టిస్ జితేంద్ర కుమార్ సిన్హాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోర్టు ఆయనను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి మూడో వారంలో జరగనుంది.

# ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు పెట్టాలి: తేజస్వీ యాదవ్

పాట్నా: ఢిల్లీలో కొత్తగా మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు ఆర్జేడీ నాయకులు తేజస్వి యాదవ్. బీజేపీ కుట్రలు పన్ని అరవింద్ కేజ్రీవాల్ ను ఓడించిందని... తప్పుడు కేసులు బనాయించి ఇరికించిందని ఫైర్ అయ్యారు. కోర్టు ముందు బీజేపీ వేసిన కేసులు నిలువలేకపోయాయని చురకలు అంటించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత ఇతరులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు తేజస్వి యాదవ్. ఈ తప్పుడు కేసు కారణంగా 2025లో ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోయిందని వెల్లడించారు. ఇక ఈ కేసు తేలిపోయిందని, ఇప్పుడు మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. మరోసారి ఎన్నికలు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అవుతాడు అని కూడా స్పష్టం చేశారు. అందుకే ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు ఆర్జేడీ నాయకులు తేజస్వి యాదవ్. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఆలోచన చేయాలన్నారు.

వయ్యారి చిత్రం



అనుష్క లూహోర్



# అభిమానులకు విరోష్ ఫీస్ట్

విజయ్ దేవరకొండ , రష్మిక మందన్న ఇన్ని రోజులు రూమర్డ్ జంటగానే ప్రేక్షకులకు కనిపించి అంచనాలు పెంచేశారు. అలాంటిది తొలిసారి వివాహం తర్వాత కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవనే చెప్పాలి ముఖ్యంగా ఈ క్రేజీ సెలబ్రిటీపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు ఆనందంతో వెల్లి విరిసిన ఆ క్షణం కన్నులవిందు గా ఉంది అని నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళితే.. ఫిబ్రవరి 26వ తేదీన ఉదయపూర్ ప్యాలెస్ లో 100 మంది అత్యంత సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో.. ఉదయం 10:10 గంటలకు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న హిందూ సంప్రదాయం ప్రకారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. అదే రోజు సాయంత్రం 4:30 రష్మిక కుటుంబ మత ఆచారాల ప్రకారం కొడవ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఇక వివాహం అనంతరం విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ తమ ఇన్స్టాగ్రామ్ ఖాతాల ద్వారా పెళ్లి ఫోటోలను పంచుకోగా.. ఈ ఫోటోలు వచ్చిన 12 గంటల్లోనే ఏకంగా 28 మిలియన్ వ్యూస్ సొంతం చేసుకొని రికార్డు సృష్టించాయి. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం.. హైదరాబాదులో తాజ్ కృష్ణ హోటల్ వేదికగా మార్చి 4వ తేదీన జరిగే రిసెప్షన్ కోసం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న స్వయంగా కలిసి వెండి గణేష్ విగ్రహాన్ని బహుమతిగా అందజేసి. ఇన్విటేషన్ కార్డు ఆయనకు ఇచ్చి.. సగౌరవంగా రిసెప్షన్ కు ఆహ్వానించారు. ఆ తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసి రిసెప్షన్ కు ఆహ్వానించారు. ఇకపోతే మీడియా సమక్షంలో ఈ జంట ఎప్పుడెప్పుడు కనిపిస్తుందని ఎదురుచూసిన అభిమానులకు ఆ తరుణం రానే వచ్చింది. వైట్ కుర్తా సెట్ లో విజయ్ దేవరకొండ.. రెడ్ కలర్ పైజామాలో రష్మిక మందన్న తొలిసారి వివాహం తర్వాత ఉదయ్ పూర్ ఎయిర్పోర్ట్లో కనిపించి సందడి చేశారు.

# విజయ్‌కు నటితో ఎఫైర్

## భార్య సంచలన ఆరోపణలు

కోలీవుడ్ దళపతి విజయ్ వ్యక్తిగత జీవితం ఇప్పుడు ఒక పెను తుఫానులా మారింది. 26 ఏళ్ల వైవాహిక బంధం తర్వాత ఆయన భార్య సంగీత విడాకులు కోరడమే కాకుండా, విజయ్‌పై సంచలన ఆరోపణలు చేయడం తమిళనాట ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒక నటితో వివాహేతర సంబంధం వల్లే తాము విడిపోతున్నామంటూ ఆమె పిటిషన్‌లో పేర్కొన్నట్లు వస్తున్న వార్తలు అభిమానులను షాక్‌కు గురిచేస్తున్నాయి. అసలు ఈ గొడవ వెనుక ఉన్న కారణాలేంటి? సంగీత ఆరోపణల్లో నిజమెంత? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. విజయ్, సంగీత మధ్య గొడవలకు ఒక స్టార్ హీరోయిన్ కారణమని గత కొంతకాలంగా వినిపిస్తున్న రూమర్స్ ఇప్పుడు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. సంగీత తన విడాకుల పిటిషన్‌లో విజయ్‌కు ఒక నటితో వివాహేతర సంబంధం ఉందని నేరుగా ఆరోపించినట్లు సమాచారం. 2021లోనే ఈ విషయం తనకు తెలిసిందని, ఆ సమయంలో విజయ్ ఇకపై అలాంటివి జరగవని హామీ ఇచ్చినప్పటికీ, తన పద్ధతి మార్చుకోలేదని ఆమె పేర్కొన్నట్లు



సమాచారం. ఇక పదే పదే తన నమ్మకాన్ని వమ్ము చేస్తూ, మళ్ళీ అదే సంబంధాన్ని కొనసాగించడం వల్లే తాను తీవ్ర మానసిక బాధకు గురయ్యానని, అందుకే విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పిటిషన్‌లో వివరించినట్టు తెలుస్తుంది. ఇక సంగీత దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రత్యేక వివాహ చట్టంలోని కొన్ని సెక్షన్స్ కింద విడాకులు కోరడం గమనార్హం. ఇవి ప్రధానంగా వివాహేతర సంబంధం, క్రూరత్వాన్ని సూచిస్తాయి. విజయ్ తన పట్ల క్రూరంగా వ్యవహరించారని, పెళ్లి మీద గౌరవం లేకుండా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. ఇక ఈ పిటిషన్‌ను స్వీకరించిన చెంగల్‌పట్టు కోర్టు, దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ ఏప్రిల్ 20న విచారణకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పెళ్లయిన 26 ఏళ్ల తర్వాత, పిల్లలు పెద్దయ్యాక ఇలాంటి ఆరోపణలతో సంగీత కోర్టుకెక్కిందంటూ వస్తున్న వార్తలు ఇప్పుడు తమిళ సినీ మరియు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఉగాది నుంచి మెగా 'విశ్వంభర'?

ఉగాది నుంచి మెగా ట్రీట్ మొదలు కానుందని సమాచారం. ఓవైపు ఉస్తాద్ భగత్ సింగ్, మరోవైపు పెద్ది సినిమాలకు సంబంధించిన అప్ డేట్ లతో పాటు, మెగాస్టార్ చిరంజీవి విశ్వరూపం ప్రదర్శిస్తున్న విశ్వంభర ట్రీట్ కూడా షురూ అవుతుందని సమాచారం. పూర్తి వివరాల్లోకి వెళితే... మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో ఈ సంక్రాంతి బరిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు తన తదుపరి విజువల్ ఫీస్ట్ విశ్వంభరతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా విడుదలపై గత కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు త్వరలోనే తెరపడనుంది. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం.. మెగా ఫ్యాన్స్‌కు అసలైన ట్రీట్ ఉగాది నుంచే మొదలుకాబోతోంది. ట్రైలర్ తో అసలైన ప్రచారం ప్రారంభించేందుకు ప్రతిదీ సిద్ధం చేస్తున్నారని సమాచారం. దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక విలువలతో విజువల్ బ్యూటీతో తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఏప్రిల్ నాటికే సినిమా ఫైనల్ కట్ సిద్ధం కానుంది. మేకర్స్ ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.






# బిగ్ ప్రాజెక్టులో గీతా భగత్

ప్రముఖ యాంకర్ గీతా భగత్ నటిగా ఎంట్రీ ఇస్తున్నారు. టెలివిజన్ షోలు, ఈవెంట్ హోస్టింగ్, సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే గీతా భగత్ కు మంచి ఫ్యాన్ బేస్ ఉంది. ఆమె స్టైల్, ప్రెజెన్స్ కు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పుడు అదే క్రేజ్ ఆమెకు సినిమా అవకాశాన్ని తెచ్చిపెట్టింది. ఆమె నటించబోయే సినిమా కూడా చిన్న, మిడ్ రేంజ్ మూవీ కూడా కాదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ లో ఆమె కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఆ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అలాంటి క్రేజీ ప్రాజెక్ట్ తో గీతా భగత్ సినీ జర్నీ స్టార్ట్ కావడం విశేషం. సాధారణంగా కొత్తవారికి చిన్న సినిమా ద్వారా డెబ్యూ ఛాన్స్ దక్కుతుంటుంది. కానీ గీతా భగత్ మాత్రం తొలి మూవీనే స్టార్ హీరో, స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ లో రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అది కూడా కీలక పాత్ర దక్కడం విశేషం. ఏదేమైనా టీవీ యాంకర్లు వరుసగా ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

## డెకాయిట్ 'రుబరూ'..

# లవ్‌లీ!

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబోలో రూపొందుతున్న మూవీ డెకాయిట్. మ్యూజిక్ ప్రమోషన్స్ లో భాగంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ రుబరూను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఆ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నిజానికి రీసెంట్ గా మేకర్స్ గ్లింప్స్ రిలీజ్ చేసి.. సాంగ్ కోసం అందరూ వెయిట్ చేసేలా చేశారు మేకర్స్. మళ్లీ మళ్లీ నిన్నే చూడాలని అంటుంది మనసే.. అంటూ సాగుతున్న ఆ పాట ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. డెకాయిట్ ఫస్ట్ సింగిల్ కు భాస్కర్ భట్ల రవికుమార్ లిరిక్స్ అందించగా.. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేశారు. చిన్మయి శ్రీపాదతో కలిసి ఆయన ఆలపించడం విశేషం. ఇక సాంగ్ కచ్చితంగా చార్ట్ బస్టర్ గా నిలిచేలా కనిపిస్తోంది. ముఖ్యంగా సినిమాలో అడివి శేష్–మృణాల్ ఠాకూర్ మధ్య కెమిస్ట్రీ మాత్రం ఫుల్ గా వర్కౌట్ అయినట్టు క్లియర్ గా సాంగ్ ద్వారా తెలుస్తోంది.



# హీరోయిన్లలో మృణాల్ కొత్త ట్రెండ్

హీరోయిన్లపై సైజ్ జీరో ముద్ర వేయాలనే ఒత్తిడి సినీ ఇండస్ట్రీలో కొత్తదేమీ కాదు. కానీ ఆ ట్రెండ్‌కు భిన్నంగా తన స్వరాన్ని వినిపిస్తున్నారు మృణాల్ ఠాకూర్ . తనకు ఆరోగ్యం ముఖ్యమని, అవాస్తవమైన అందాల ప్రమాణాలను మ్యాచ్ చేయడం తనకు ముఖ్యం కాదని ఆమె స్పష్టంగా చెప్పడం, కేవలం వ్యక్తిగత అభిప్రాయంగా మాత్రమే కాకుండా బాడీ పాజిటివిటీపై ఒక స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ గా మారింది. తెలుగు ఆడియన్స్ తన గ్లామర్ ను, స్క్రీన్ ప్రెజెన్స్ ను యధాతథంగా స్వీకరించారని ఆమె చెప్పడం చూస్తుంటే బాలీవుడ్ లో మృణాల్ తన బరువు విషయంలో ప్రశ్నలు ఎదుర్కొన్నారేమో అనిపిస్తోంది.






# తాప్సీ యూటర్న్

టాలీవుడ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన హీరోయిన్ తాప్సీ పన్ను ఇప్పుడు యూటర్న్ తీసుకుంది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ, 'నాకు నటిగా మొదటి అవకాశాలు ఇచ్చింది తెలుగు సినిమా. ఇక్కడే నేను ఎక్కువగా నేర్చుకున్నాను. విభిన్న పాత్రలు చేసే అవకాశం కూడా టాలీవుడ్ వల్ల వచ్చింది. నా కెరీర్ కు స్ట్రాంగ్ ఫౌండేషన్ తెలుగు ఇండస్ట్రీనే' అని చెప్పింది. అంతేకాదు, ఇతర ఇండస్ట్రీల్లో లభించని అభిమానాన్ని కూడా తెలుగులోనే పొందానని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఇటీవల విడుదలైన ఆమె తాజా చిత్రం అస్సీ బాక్సాఫీస్ వద్ద అనుకున్న రేంజ్ లో రెస్పాన్స్ అందుకోలేదు. దీంతో ఆమె కెరీర్ పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఆమె తన గత వ్యాఖ్యలను మార్చుకుంటా టాలీవుడ్ పై ప్రశంసలు కురిపించడం వెనుక అదే కారణమా అన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ పై నెటిజన్లు, సినీ ప్రియులు రెస్పాండ్ అవుతున్నారు. నటీనటులు ఎక్కడి నుంచి అవకాశాలు వచ్చాయో గుర్తుంచుకోవడం అవసరమని, కెరీర్ స్టార్టింగ్ లో సహకరించిన ఇండస్ట్రీపై నెగిటివ్ కామెంట్స్ చేస్తే అభిమానుల్లో దూరం పెరుగుతుందని అంటున్నారు. అదే సమయంలో తప్పు సరిదిద్దుకోవడం మంచిదే అని చెబుతున్నారు.

# పాన్ సౌత్ రేస్‌లో కయాదు



సౌత్ సినీ పరిశ్రమలో వేగంగా ఎదుగుతున్న యంగ్ హీరోయిన్లలో కయాదు లోహర్ కూడా ఒకరు. రీసెంట్ గా ఆమె తన కెరీర్ ను మలచుకుంటున్న విధానం ప్రత్యేకంగా నిలుస్తోంది. అందులో భాగంగానే టాలీవుడ్‌లో కయాదు ఫ్యూచర్ ను డిసైడ్ చేసే సినిమాగా ది ప్యారడైజ్ రాబోతుంది. నేచురల్ స్టార్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని నటిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమా సక్సెస్ అందుకుంటే, కయాదు లోహర్ కు తెలుగులో అది గేమ్ ఛేంజర్ అవుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. కయాదు ఇప్పటికే టాలీవుడ్‌లో తన టాలెంట్ ను చూపించినప్పటికీ, ఒక స్ట్రాంగ్ కమర్షియల్ హిట్ మాత్రం ఆమెకు దక్కాల్సి ఉంది. ఇలాంటి టైమ్‌లో ది ప్యారడైజ్ ఆమెకు కీలక పరీక్షగా మారింది. నాని సినిమాలు సాధారణంగా కంటెంట్ ఆధారంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.

## రింకూ తండ్రి కన్నుమూత

టీమిండియా హార్డ్ హిట్టర్ రింకూ సింగ్ తండ్రి ఖచంద్ర సింగ్ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఖచంద్ర సింగ్ పరిస్థితి విషమించడంతో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించగా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో రింకూ సింగ్ సభ్యుడిగా ఉన్నారు. తండ్రి ఆరోగ్యం క్షీణించిందన్న వార్త తెలియగానే ఆయన చెన్నైలో జింబాబ్వేతో జరగాల్సిన మ్యాచ్ తర్వాత జట్టును వీడి హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. టోర్నీలో



అతడు మిగిలిన మ్యాచ్‌లకు ఆయన అందుబాటులో ఉంటారా లేదా అన్నది ఇంకా క్లారిటీ రాలేదు. కాగా, రింకూ సింగ్ తండ్రి ఖచంద్ర సింగ్ గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే సాధారణ కార్మికుడిగా పనిచేస్తూ తన కుమారుడిని క్రికెటర్‌గా తీర్చిదిద్దారు. తన విజయాల్లో తండ్రి ఖచంద్ర సింగ్ పాత్ర ఎంతో కీలకమైందని చాలా ఇంటర్వ్యూలో రింకు సింగ్ ప్రస్తావించారు.

### రింకూ కీలక నిర్ణయం

కీలక మైన మ్యాచ్ వెస్టిండీస్ జట్టుతో జరగనున్న నేపథ్యంలో రింకు కీలక నిర్ణయం తీసుకొని తన నిబద్ధతతో మరోసారి క్రీడాభిమానుల మనసు గెలుచుకున్నారు. తండ్రి మరణవార్త విన్న వెంటనే స్వగ్రామానికి వెళ్లిన రింకూ, అంత్యక్రియల అనంతరం ఏమాత్రం ఆలస్యం చేయకుండా తిరిగి జాతీయ జట్టులో చేరాలని నిర్ణయించుకున్నారు.



# ఇంగ్లండ్ థ్రిల్లింగ్ విన్

### మెరిసిన విల్ జాక్స్, రెహాన్ అహ్మద్

### కివీస్ అనూహ్య ఓటమి.. సెమీస్ రేసులో పాకిస్థాన్

### పాక్, శ్రీలంక మ్యాచ్ ఫలితంపై కివీస్ భవితవ్యం

**టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన ఓ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో న్యూజిలాండ్ ఓటమి పాలైంది. ఈ ఫలితం పాకిస్థాన్ శిబిరంలో ఆనందాన్ని నింపింది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే న్యూజిలాండ్ నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించేది. కానీ ఇంగ్లండ్ చేతిలో ఓడిపోవడంతో కివీస్ సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి.**

దీంతో వారి భవితవ్యం పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరగబోయే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. ఇప్పటికే ఈ గ్రూప్ నుంచి ఇంగ్లండ్ సెమీస్ చేరింది. రెండో బెర్తు కోసం న్యూజిలాండ్, పాక్ రేసులో ఉన్నాయి. రేపటి పోరులో పాక్ భారీ తేడాతో శ్రీలంకపై గెలిస్తే, మెరుగైన రన్ రేట్ ఆధారంగా న్యూజిలాండ్ ను వెనక్కినెట్టి సెమీస్ బెర్తు సొంతం చేసుకుంటుంది. శుక్రవారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (39), టిమ్ సీఫెర్ట్ (35) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్, ఆరంభంలోనే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, టామ్ బాంటన్ (33), శామ్ కరన్ (24) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. చివర్లో విల్ జాక్స్ (18 బంతుల్లో 32 నాటౌట్), రెహాన్ అహ్మద్ (7 బంతుల్లో 19 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో మరో మూడు బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. న్యూజిలాండ్ బౌలర్ రచిన్ రవీంద్ర 4 ఓవర్లలో కేవలం 19 పరుగులిచ్చి 3 వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ 2 సెమీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది.





## ఐపీఎల్ ఆలస్యం!?

### రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యే చాన్స్

### మార్చి 28న ప్రారంభమై మే 31న ముగింపు

### 3 రాష్ట్రాల ఎన్నికల తేదీల కోసమే షెడ్యూల్ చేంజ్!

ఈ సంవత్సరం ఐపీఎల్ రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మార్చి 26 నుంచి ఐపీఎల్-2026 ప్రారంభమవుతుందని తొలుత ప్రకటించినప్పటికీ వివిధ కారణాల వల్ల రెండు రోజుల తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మార్చి 28న ప్రారంభమై మే 31న జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. వచ్చే వారంలో దీనికి సంబంధించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభం కావడానికి ముందు ఫ్రాంచైజీలకు, ఆటగాళ్ళకు కొంత సమయం ఇవ్వాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. పూర్తిస్థాయి షెడ్యూల్, వేదికలకు సంబంధించి వచ్చే వారం వెల్లడించవచ్చని తెలుస్తోంది. అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికలకు సంబంధించి తేదీలపై స్పష్టత రానందున బీసీసీఐ వేచి చూస్తోందని తెలుస్తోంది. ఎందుకంటే కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు పశ్చిమ బెంగాల్, తమిళనాడు నుంచి ఉన్నాయి. అలాగే రాజస్థాన్ రాయల్స్‌కు గౌహతి రెండో హోంగ్రౌండ్. ఈ నేపథ్యంలో ఎన్నికల తేదీలకు అనుగుణంగా మ్యాచ్ తేదీలను ఖరారు చేయడానికి వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే షెడ్యూల్ రెండు దశల్లో విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# మళ్లీ డకౌట్ అయినా ఫర్వాదలేదన్నారు



టీమ్ మేనేజ్‌మెంట్ అందించిన సహకారంతోనే తాను ఫామ్ అందుకోగలిగానని అభిషేక్ శర్మ తెలిపాడు. మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన అభిషేక్ శర్మ.. జట్టు సపోర్ట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నా కంటే సహచర క్రికెటర్లకే నాపై నమ్మకం ఎక్కువగా ఉంది. హాఫ్ సెంచరీ చేశాక భావోద్వేగానికి గురయ్యా. అత్యుత్తమ ఆటతీరు కనబర్చేందుకు ప్రయత్నించా. అయినా నా బెస్ట్ ఇంకా రాలేదు. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ చాలా అద్భుతంగా ఉంది. మేం ఒక జట్టులా కాకుండా కుటుంబంలా ఉంటాం. అందుకే నా నుంచి బెస్ట్ గేమ్ రావాలని జట్టు అంతా కోరుకుంది. ఆ రోజు తప్పకుండా వస్తుందని ఆశిస్తున్నా. నేను కూడా ఎదురు చూస్తున్నా. టీ20 ప్రపంచకప్ ప్రారంభమయ్యే సమయానికి నా ఆరోగ్యం కూడా అంత బాలేదు. అంతకుముందు ఆసుపత్రిపాలయ్యా. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో దేశం కోసం తొలి మ్యాచ్ ఆడేటప్పుడు మంచి ఆరంభం దక్కాలని కోరుకున్నా. కానీ అలా జరగలేదు. అయినా సరే, జట్టు సభ్యుల నుంచి ఇప్పటికీ అదే మద్దతు లభిస్తోంది. మరీ ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యభాయ్ నాపై చాలా నమ్మకం ఉంచారు. ఇంకో మ్యాచ్ డకౌట్ అయినా సరే పక్కన పెట్టేది లేదని.. జట్టు కోసం విజయాలు అందించాలని చెప్పారు. జట్టుకు కీలకమైన ప్లేయర్‌గా నన్ను భావించారు. అందుకే, జింబాబ్వేపై హాఫ్ సెంచరీని నేను నా జట్టు సహచరులు, కోచ్, కెప్టెన్‌కు అంకితం చేశాం.'అని అభిషేక్ వెల్లడించాడు.



# ఆసీస్ మహిళలదే ట్రోఫీ



### రెండో వన్డేలో భారత్ ఓటమి

భారత జట్టుకు మరో ఓటమి ఎదురైంది. హోబర్ట్‌లోని బెల్లెరివ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా చేతిలో 5 వికెట్ల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. ఈ మ్యాచులో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (31), ప్రతిక రావల్ (52) తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (54) వరుసగా రెండో హాఫ్ సెంచరీతో రాణించినప్పటికీ, మిడిల్ ఆర్డర్ వైఫల్యం తో భారత్ భారీ స్కోరు సాధించలేకపోయింది. అనంతరం 252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా మహిళల జట్టు కేవలం 36.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆసీస్ బ్యాటర్ జార్జియా వోల్ (101) అద్భుత సెంచరీతో భారత్ ఆశలపై నీళ్లు చల్లగా, ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (80) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో కాశ్వి గౌతమ్, దీప్తి శర్మ తలో రెండు వికెట్లు తీసినా ఆసీస్ జోరును అడ్డుకోలేకపోయారు. వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్, ఆదివారం (మార్చి 1) ఇదే వేదికపై జరగనున్న నామమాత్రపు మూడో వన్డేలోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని భావిస్తోంది.

## ఇండియాకు సెమీస్ అర్హత లేదు: అఫ్రిదీ

టీ20 వరల్డ్ కప్ రసవత్తరంగా సాగుతున్న వేళ, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ భారత జట్టుపై విమర్శలు గుప్పించాడు. టోర్నీలో టీమిండియా ప్రదర్శనను తక్కువ చేస్తూ, భారత్‌కు సెమీఫైనల్ చేరే అర్హత లేదంటూ ఎప్పటి మాదిరే విద్వేషాన్ని వ్యక్తం చేశాడు. లీగ్ దశ, సూపర్-8లో భారత్ సాధించిన విజయాలను... 'అసలు విజయాలే కావన్నట్టు' ఆఫ్రిది కొట్టిపారేశాడు. టీమిండియా కేవలం చిన్న జట్లపై మాత్రమే గెలుస్తూ టోర్నీ స్థాయిని దిగజారుస్తోందని విమర్శించాడు. "దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్లను ఎదుర్కొన్నప్పుడు భారత్ పూర్తిగా తేలిపోయింది. అమెరికాపై సూర్యకుమార్ యాదవ్ ఆడకపోయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. పాక్‌తో మ్యాచ్‌లోనూ భారత్‌ది అదృష్ట విజయమే" అని ఎద్దేవా చేశాడు. టోర్నీలో భారత్ కంటే వెస్టిండీస్ జట్టే అద్భుతమైన ప్రదర్శన చేసిందని ఆఫ్రిది అభిప్రాయపడ్డాడు. సెమీఫైనల్ చేరేందుకు కరేబియన్లకే 100 శాతం అర్హత ఉందని అన్నాడు. మరోవైపు, ఆఫ్రిది వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భారత అభిమానులు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు.

## ఆకిబ్ నబీని టీమిండియాలోకి తీసుకోవాలి



జమ్మూ కశ్మీర్ యువపేసర్ ఆకిబ్ నబీపై టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రశంసల జల్లు కురిపించాడు. రంజీ ట్రోఫీలో అసాధారణ ప్రదర్శన కనబర్చిన ఈ కుర్రాడిని టీమిండియాలోకి తీసుకోవాలని, ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయాలని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు సూచించాడు. ఈ సీజన్ రంజీ ట్రోఫీ 2025-26లో ఆకిబ్ నబీ 60 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. కర్ణాటకతో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లోనూ ఐదు వికెట్ల(5/54)తో ఆ జట్టు పతనాన్ని శాసించాడు. రంజీ ట్రోఫీ చరిత్రలోనే ఒకే ఎడిషన్‌లో 60 ప్లస్ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నబీ నిలిచాడు. నబీ బౌలింగ్ ప్రదర్శనకు ఫిదా అయిన సౌరవ్ గంగూలీ.. ఎక్స్‌వేదికగా అతన్ని కొనియాడాడు. టీమిండియా టెస్ట్ టీమ్‌లోకి తీసుకోవాలని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు సూచించాడు. 'పట్టుదల, కృషి ఉంటే ఏం చేయవచ్చో జమ్మూ కశ్మీర్ ప్రపంచానికి చూపించింది. వారు ఆ ప్రాంతం గర్వపడేలా చేశారు. కష్టతరమైన వాతావరణం మనుషులను దృఢంగా మారుస్తుంది. ఆకిబ్ నబీ జాతీయ జట్టు జెర్సీని ధరించే దిశగా సాగుతున్నాడు. ఈ వేసవిలో ఇంగ్లండ్ పర్యటన అతని సరైన వేదిక.'అని ట్వీట్ చేసిన దాదా.. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను ఈ పోస్ట్‌కు ట్యాగ్ చేశాడు.

## భారత్-వెస్టిండీస్ మ్యాచ్ రద్దయితే..!

### నెట్ రన్‌రేట్ ఆధారంగా వెస్టిండీస్ ముందంజ.. మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు!

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, టీ20 ప్రపంచకప్‌లో అత్యంత కీలకమైన సమరానికి సిద్ధమైంది. ఆదివారం కోల్‌కతాలోని చారిత్రాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌తో వర్చువల్ క్వార్టర్ ఫైనల్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. గ్రూప్-ఏ నుంచి ఇప్పటికే దక్షిణాఫ్రికా సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకోగా, రెండో స్థానం కోసం ఈ రెండు జట్లు తలపడనున్నాయి. దీంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, ఈ మ్యాచ్ ఫలితం కన్నా వాతావరణమే భారత జట్టును, అభిమానులను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవేళ వర్షం లేదా ఇతర కారణాలతో మ్యాచ్ రద్దయితే, ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే సౌకర్యం కూడా లేదు. అలాంటప్పుడు రెండు జట్ల పాయింట్లు సమానమవుతాయి. నిబంధనల ప్రకారం, అప్పుడు నెట్ రన్‌రేట్ ఆధారంగా సెమీస్ బెర్త్‌ను నిర్ణయిస్తారు. ఈ సమీకరణంలో వెస్టిండీస్ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. విండీస్ నెట్ రన్‌రేట్ ప్లస్ 1.791 ఉండగా, భారత్ రన్‌రేట్ మైనస్ 0.100గా ఉంది. కాబట్టి, మ్యాచ్ రద్దయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా వెస్టిండీస్ ముందంజ వేసి సెమీస్‌కు చేరుకుంటుంది, ఆతిథ్య జట్టు భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో, టీమిండియా ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, అభిమానులకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, ఆదివారం కోల్‌కతాలో వర్షం పడే సూచనలు లేవని వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 28-2-2026 | www.evarthalu.com



## వ్యూహాత్మక విజయం

ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ద్వారా భారత్ అనేక కీలక విజయాలను సాధించింది. ఈ పర్యటనలో రెండు దేశాల మధ్య సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ మొత్తం 27 ముఖ్యమైన ఫలితాలు (17 ఒప్పందాలు, 10 కీలక ప్రకటనలు) వెలువడ్డాయి.

రక్షణ రంగంలో ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై దృష్టి సారించారు. ముఖ్యంగా నవంబర్ 2025లో కుదిరిన రక్షణ సహకార ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ మరియు సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో సహకారం కోసం కొత్త భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. భారత్‌లో ఇండో-ఇజ్రాయెల్ సైబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ రంగంలో సుమారు 100 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే 'విలేజెస్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రాజెక్టును మరింత విస్తరించనున్నారు. ఇజ్రాయెల్‌లో భారతీయ యూపీఐ సేవలను ప్రవేశపెట్టడానికి ఒప్పందం కుదిరింది. అలాగే భారత్-ఇజ్రాయెల్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కానుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 50,000 మంది భారతీయ కార్మికులకు ఇజ్రాయెల్‌లోని నిర్మాణం, కేర్‌గివింగ్ రంగాలలో ఉపాధి కల్పించేందుకు కోటాను కేటాయించారు. ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ వంటి అంతర్జాతీయ ప్రాజెక్టులలో కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం

## తెలంగాణ ప్రగతి..
# సవాళ్ల సందిగ్ధాలు

**తెలంగాణ రాష్ట్రం 2026-27 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకవైపు మౌలిక సదుపాయాల కల్పన, మరోవైపు ఆరు గ్యారంటీల అమలు కోసం నిధుల సమీకరణ ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.**



ఇటీవల జరిగిన పురపాలక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన పట్టును నిరూపించుకోగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం వంటి అంశాలు రాజకీయ సెగలు పుట్టిస్తుండగా, అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అదే సమయంలో, దశాబ్దాల కాలంగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమ అగ్రనేతల లొంగుబాటుతో రాష్ట్రంలో అంతర్గత భద్రత పరంగా ఒక కీలక అధ్యాయం ముగిసినట్లయింది. రాష్ట్ర బడ్జెట్ పరిమాణం రూ. 3.11 లక్షల కోట్ల నుండి రూ. 3.30 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. అయితే, పెరుగుతున్న అప్పుల భారం, వడ్డీల చెల్లింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 745 కోట్ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేయడం ఉద్యోగ వర్గాల్లో కొంత ఊరటనిచ్చింది. పారిశ్రామికంగా, ముఖ్యంగా ఐటీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ దూసుకుపోతున్నా, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఉపాధి అవకాశాల కొరత ఇంకా వేధిస్తూనే ఉంది. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకుంటూనే, అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలను అందించడం ఇప్పుడు ప్రభుత్వ ముందున్న ప్రధాన లక్ష్యం. కేవలం అంకెలే కాకుండా, క్షేత్రస్థాయిలో సామాన్యుడి జీవితాల్లో మార్పు వచ్చినప్పుడే నిజమైన బంగారు తెలంగాణ సాధ్యమవుతుంది.

- గుగ్గిళ్ల వెంకటేశ్, ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్




National Science Day



## రామన్ ఎఫెక్ట్..
# విజ్ఞాన ప్రగతి

(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)




**ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన భారతదేశం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుంది. ఇది కేవలం ఒక క్యాలెండర్ తేదీ మాత్రమే కాదు; ఒక సామాన్య భారతీయుడు తన మేధస్సుతో ప్రపంచ గతిని మార్చిన అద్భుత క్షణానికి గుర్తు. 1928 ఫిబ్రవరి 28న సర్ సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను అధికారికంగా ప్రకటించారు. ఈ ఆవిష్కరణకు గాను 1930లో ఆయనకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.**



సైన్స్ విభాగంలో నోబెల్ పొందిన మొదటి ఆసియావాసిగా చరిత్ర సృష్టించారు. ప్రతి ఏడాది ఒక ప్రత్యేక లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 2026 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం 'వుమెన్ ఇన్ సైన్స్: క్యాటలైజింగ్ వికసిత్ భారత్' థీమ్‌ను ఎంచుకుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంలో మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకులు మరియు ఆవిష్కర్తల పాత్రను గుర్తించి, వారిని ప్రోత్సహించడమే ఈ ఏడాది ప్రధాన ఉద్దేశ్యం. సముద్రం నీలంగా ఎందుకు ఉంటుంది? అనే సాధారణ ప్రశ్న సర్ సీవీ రామన్ మనసులో కలిగింది. అప్పట్లో అందరూ ఆకాశం ప్రతిబింబం వల్ల సముద్రం నీలంగా కనిపిస్తుందని భావించేవారు. కానీ రామన్ తన పరిశోధనల ద్వారా కాంతి కిరణాలు ద్రవాల గుండా ప్రయాణించినప్పుడు పరిక్షేపం చెందుతాయని, దీనివల్ల తరంగదైర్ఘ్యంలో మార్పు వస్తుందని నిరూపించారు. దీనినే 'రామన్ ఎఫెక్ట్' అంటారు.

ఈ సూత్రం నేడు మందుల తయారీ, స్పెక్ట్రోస్కోపీ, సెమీకండక్టర్ల పరిశ్రమలో కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నాం. ప్రజలలో, ముఖ్యంగా విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి, తర్కబద్ధమైన ఆలోచనను పెంపొందించడమే దాని ఉద్దేశం. పాఠశాలలు, కళాశాలల్లో సైన్స్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు నిర్వహించి శాస్త్ర సాంకేతికతపై ఆసక్తిని పెంచడమూ లక్ష్యం. శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ నేడు అగ్రగామిగా ఎదుగుతోంది. చంద్రయాన్-3 విజయం, టీకాల తయారీలో మన సత్తా, డిజిటల్ విప్లవం ఇవన్నీ రామన్ వంటి మహానుభావుల స్ఫూర్తికి నిదర్శనం. 2026 నాటి మహిళా ప్రాతినిధ్య థీమ్ ద్వారా రాబోయే తరంలో మరింత మంది మహిళలు సైన్స్ వైపు మొగ్గు చూపి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిద్దాం.

### రామన్ ఎఫెక్ట్ అంటే..



సాధారణంగా కాంతి కిరణాలు ఏదైనా వస్తువుపై లేదా ద్రవంపై పడినప్పుడు అవి చెల్లాచెదురు అవుతాయి. దీనినే పరిక్షేపం అంటారు. రైలీ పరిక్షేపం: ఇందులో కాంతి శక్తి గానీ, రంగు (తరంగదైర్ఘ్యం) గానీ మారదు. రామన్ ఎఫెక్ట్: కాంతి కిరణం ఒక పదార్థంలోని అణువులను తాకినప్పుడు, ఆ అణువులతో జరిగే పరస్పర చర్య వల్ల కాంతి తన శక్తిని కోల్పోవడం లేదా అదనపు శక్తిని పొందడం జరుగుతుంది. దీనివల్ల కాంతి తరంగదైర్ఘ్యం మారుతుంది. అంటే, పతనమైన కాంతి రంగు కంటే విభిన్నమైన రంగు కలిగిన కాంతి వెలువడుతుంది. ఆ కాలంలో రామన్ వద్ద అత్యాధునిక పరికరాలు లేవు. కేవలం రూ. 200 ఖరీదు చేసే స్పెక్ట్రోస్కోప్, సూర్యరశ్మిని వాడుకుని ఈ ప్రయోగాలు చేశారు. అణువుల ద్వారా కాంతి రంగు మారే ప్రక్రియ చాలా బలహీనంగా ఉంటుంది (కోటి కాంతి కిరణాలలో ఒకటి మాత్రమే రామన్ పరిక్షేపానికి గురవుతుంది). అటువంటి సూక్ష్మమైన మార్పును గుర్తించడం రామన్ మేధస్సుకు నిదర్శనం. రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతానికే పరిమితం కాలేదు. నేడు ఇది అనేక రంగాలలో కీలకంగా మారింది.

ఔషధ రంగం: మందుల నాణ్యతను పరీక్షించడానికి, నకిలీ మందులను గుర్తించడానికి 'రామన్ స్పెక్ట్రోస్కోపీ' వాడుతారు.

రక్షణ రంగం: విమానాశ్రయాల్లో పేలుడు పదార్థాలను, మత్తు పదార్థాలను ప్యాకెట్ విప్పకుండానే గుర్తించడానికి ఉపయోగిస్తారు.

వైద్య రంగం: క్యాన్సర్ కణాలను గుర్తించడంలో, శరీరంలోని కణజాలాల అధ్యయనంలో సహాయపడుతుంది.

నానో టెక్నాలజీ: కార్బన్ నానో ట్యూబ్స్, గ్రాఫిన్ వంటి పదార్థాల నిర్మాణాన్ని విశ్లేషించడానికి ఇది ప్రధాన ఆధారం.

అంతరిక్ష పరిశోధన: ఇతర గ్రహాల మీద ఉన్న ఖనిజాలను, రసాయనాలను విశ్లేషించడానికి రోవర్లలో రామన్ స్పెక్ట్రోమీటర్లను అమర్చుతారు.



- రామస్వామి చింత




రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.